www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

బుధవారం

16-08-2023

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 56

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విదేశాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలు

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులు 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారతీయ దౌత్య కార్యాలయాల్లో మువన్నెల జెండాలు రెపరెపలాడాయి. జాతీయ పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపనతో భారతీయులు సంబరాలు చేసుకున్నారు.

2 లో

విద్యుత్ ఉద్యోగులపై
నిఘా నీడ

- 'చలో విజయవాడ' భగ్నానికి సర్కారు యత్నం
- ఆంక్షలు, అణచివేత చర్యలు
- రంగంలోకి పోలీస్ బలగాలు
- 200 సీసీ కెమెరాలతో పరిశీలన
- ముఖ్యనేతలకు నోటీసులు, ముందస్తు అరెస్టులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగులు తమ కోర్కెల సాధన కోసం ఆందోళనకు దిగుతుంటే...వారిపై అణచివేత చర్యలకు జగన్ సర్కారు పాల్పడుతోంది. ఏపీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీతో ప్రభుత్వ చర్చలు విఫలమవ్వడంతో ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. దీంతో పోలీసు యంత్రాంగం వారి కదలి కలపై నిఘా పెట్టింది. వేతన సవరణ కోరుతూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఇటీవల సమ్మెకు పిలుపునివ్వగా, వారితో ప్రభుత్వం చేపట్టిన చర్చలు కొలిక్కిరాలేదు. విద్యుత్ ఉద్యోగుల పోరాట కమిటీ ఈనెల 17వ తేదీన చలో విజయవాడకు పిలుపు నివ్వడంతో ప్రభుత్వంలో అలజడి ప్రారంభమైంది. జగన్ సర్కారు ఒక్కసారిగా అప్రమత్తమై పోలీసులతో అణచివేత చర్యలకు సిద్ధమైంది. ఎక్కడికక్కడే పోలీసులు ఆంక్షలు విధించడం, విద్యుత్ ఉద్యోగులు, సంఘాల నేతల కదలికలపై నిఘా పెట్టడంలో యంత్రాంగం నిమగ్నమైంది. ఉద్యోగుల ఆందోళనను విచ్ఛిన్నం చేసేందుకుగాను

- మిగతా 2 లో

ఇక అరటి వంతు!

- టమాటాల తర్వాత హడలెత్తిస్తున్న పండ్ల ధర
- బెంగళూరులో కేజీ రూ.100

బెంగళూరు: పాలకుల ప్రగల్భాలు పరాకాష్ఠకు చేరాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేళ దేశంలో పరుగులు పెడుతున్న ధరలకు కళ్లెం వేస్తామని చెబుతున్నారు. అయితే కేంద్రంలోని మోదీ పాలనలో నిత్యావసర, ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటాయి. బియ్యం, పప్పులు, చింతపండు, టమాటాలు, కాయగూరలే కాదు ఇతరత్రా ఆహార పదార్థాల ధరలు మండి పోతున్నాయి. ఇటీవల కాలంలో టమాటా కిలో రూ.200 కు పైగా ధర పలికి సామాన్యులను హడలెత్తించింది. మార్కెట్‌లోకి సరఫరా పెరగడంతో క్రమంగా వాటి ధరలు దిగి వస్తున్నాయి. అయితే తాజాగా బెంగళూరులో కేజీ అరటి పండ్ల ధర రూ.100కి చేరింది. దీంతో కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. రైతుల

- మిగతా 2 లో

77వ స్వాతంత్ర్య దినం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్‌భవన్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అజయ్‌భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

వికేంద్రీకరణే లక్ష్యం

- మూడు రాజధానులు 3 ప్రాంతాల హక్కుగా అమలు
- పోలవరం 2025 జూన్‌కల్లా పూర్తి
- స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం జగన్
- ఆకట్టుకున్న 13 అభివృద్ధి శకటాల ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వికేంద్రీకరణ, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని ముఖ్య మంత్రి ఆవిష్కరించగా, సాయుధ దళాలు గౌరవ వందనం సమర్పించాయి. ప్రత్యేక వాహనంపై సీఎం

- మిగతా 2 లో

భవిష్యత్తుపై ప్రణాళిక ఉంటేనే
దేశాభివృద్ధి

- టీడీపీ అధినేత చంద్రబాబు
- 'ఇండియా విజన్ 2047' డాక్యుమెంట్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: భవిష్యత్తుపై ప్రణాళిక ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమని తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖలోని ఎంజీఎం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'ఇండియా విజన్ 2047' డాక్యుమెంట్‌ను చంద్రబాబు ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని టాప్-10 ధనవంతుల్లో ఐదుగురు జ్యూయిష్ లు ఉన్నారని గుర్తు చేశారు. తెలుగు జాతి కూడా అంత గొప్పస్థాయికి ఎదగాలన్నదే తన ఆకాంక్ష అని వివరించారు. రాబోయే వందేళ్ల సమయం నేటి చిన్నారులు, విద్యార్థులదేనని, దేశాభివృద్ధిలో తెలుగుజాతి ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. 'భవిష్యత్తు ప్రణాళిక లేకుంటే వ్యక్తిత్వ వికాసం కష్టం. పిల్లల చదువుపై తల్లిదండ్రులకు విజన్ ఉండాలి. విజన్ ఉన్న తల్లిదండ్రుల పిల్లలు ఉన్నత స్థానాలకు వెళ్తారు. 2017లో వందేళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొంటాం. ఏ విధంగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయో ఆలోచించాలి. ప్రపంచంలోని అన్ని దేశాల్లో భారతీయులు ఉన్నారు. మన దేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండాలని కోరుకోవాలి. మన ఆర్థిక విధానాల వల్ల 1991 వరకు

- మిగతా 2 లో

విదేశాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలు

- దౌత్యకార్యాలయాల్లో ఘనంగా స్వాతంత్ర్య దినం
- ప్రపంచ దేశాధినేతల శుభాకాంక్షలు

వాషింగ్టన్/మాస్కో/బీజింగ్: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులు 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారతీయ దౌత్య కార్యాలయాల్లో మువన్నెల జెండాలు రెపరెపలాడాయి. జాతీయ పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపనతో భారతీయులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భారతీయులకు ప్రపంచ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. భారత్‌తో ప్రత్యేక, వ్యూహాత్మక పటిష్ఠ భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఆకాంక్షించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని అల్బనీస్, అమెరికా మంత్రి ఆంటోని బ్లింకెన్ ట్వీట్లలో శుభాకాంక్షలు తెలిపారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని అల్బనీస్ భారతీయులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ సందేశమిచ్చారు. నెహ్రూ కలల సాకారాన్ని 2023లో భారతదేశం ప్రతిబింబిస్తోందని అన్నారు. విద్యార్థులు, ఎంట్రప్రెన్యూర్‌లు, వృత్తిదారులు బాగా రాణిస్తున్నారని, పరస్పరం అనుభవాలు, ఆలోచనలను పంచుకుంటున్నందుకు ఆస్ట్రేలియా రుణ పడి ఉంటుందని అన్నారు. 'మా దేశం మీకు ఇల్లు అయింది కాబట్టి మేము సంపన్న దేశంగా ఉంది' అని ఆంటోని అన్నారు. రెండు దేశాల మధ్య స్నేహబంధం మరింత పటిష్టం కావాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామిక వారసత్వాన్ని వేడుక చేసుకుందామని భారతీయులకు పిలుపునిచ్చారు. కాగా, వాషింగ్టన్‌లో భారత సంతతి అమెరికన్లు నిర్వహించిన వేడకలలో అగ్రరాజ్య అధ్యక్షుడు జో బైడెన్ పాల్గొన్నారు. చైనా రాజధాని బీజింగ్‌లోని భారతీయ దౌత్య కార్యలయంలో భారత సంతతి ప్రజలు, అధికారులు కలిసి సంబరాలు చేసుకున్నారు. చరిత్ర గుర్తించని భారతీయ మహిళా యోధుల బలిదానాలపై 'అన్‌సంగ్' పేరిట చిన్నారుల గాన ప్రదర్శన ఆకట్టుకుంది. తూర్పు చైనా మెట్రోపాలిస్ కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఎన్.నందకుమార్ షాంఘైలోని రాయబార కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆస్ట్రేలియాలో హై కమిషన్‌లో కమిషనర్ మన్‌ప్రీత్ వొహ్రా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సింగపూర్‌లో వెయ్యి మంది భారతీయులు, ఐఎన్ఎస్ ఖులిష్ సిబ్బంది వేడుకలలో పాల్గొన్నారు. ఆపద్ధర్మ హై కమిషనర్ పూజా ఎం. టిట్లు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఐఎన్ఎస్ ఖులిష్ బ్యాండ్ దేశభక్తి గీతాలను స్థానిక భారతీయ స్కూళ్ల విద్యార్థులతో కలిసి ప్రదర్శించింది. నేపాల్ విదేశాంగ మంత్రి ఎన్‌పీ సౌద్ శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. శ్రీలంక హై కమిషనర్ గోపాల్ బగ్లే, అధికారులు కలిసి ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ (ఐపీకేఎఫ్) స్మారకం వద్ద నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించుకున్నారు.

పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా కాకర్ ప్రమాణం

90 రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఎనిమిదవ ఆపద్ధర్మ ప్రధానిగా అన్వర్ ఉల్ హఖ్ కాకర్ (52) ప్రమాణ స్వీకారం చేశారు. ఇస్లామాబాద్‌లోని అధ్యక్షుడి భవనం 'ఐవాన్ ఎ సదర్'లో అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించే క్రమంలో కాకర్ తాను స్థాపించిన బలూచిస్థాన్ అవామీ పార్టీకి (బీఏపీ) రాజీనామా చేశారు. త్వరలోనే మంత్రివర్గాన్ని ప్రకటించనున్నారు. ప్రధానమంత్రి నివాసంలో కాకర్‌కు సైనిక గౌరవ వందనం లభించింది. మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆపద్ధర్మ ప్రధాని కాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవానికి కూడా హాజరయ్యారు. అయితే షరీఫ్‌కు వీడ్కోలు పలికే సందర్భంగా ఆయన కూడా సాయుధ దళాల గౌరవ వందనాన్ని అందుకున్నారు. ఈ నెల 9న పాక్ పార్లమెంట్ రద్దు అయిన సంగతి తెలిసిందే. పాక్ పార్లమెంట్ నియమాల ప్రకారం ప్రభుత్వం రద్దయిన 90 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన కారణంగా ఎన్నికల నిర్వహణ రెండు నెలలు ఆలస్యం కానున్నాయి. ఆపద్ధర్మ ప్రధానిగా కాకర్ ఎంపికపై ప్రతిపక్ష నేత రియాజ్ ఆపద్ధర్మ ప్రధానిగా చిన్న ప్రావిన్స్‌కు చెందిన నేత ఉండాలని నిర్ణయించామని, ఈ క్రమంలోనే బలూచిస్థాన్‌కు చెందిన కాకర్ పేరును తమ పార్టీ ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. దానిని మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా అంగీకరించారు. దీంతో కాకర్ ప్రమాణ స్వీకారానికి అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆమోదముద్ర వేశారు.

రష్యా పెట్రో స్టేషన్‌లో పేలుడు

35 మంది మృతి, 105 మందికి గాయాలు

మాస్కో: దక్షిణ రష్యా ప్రావిన్సులు డాగేస్థాన్ రాజధాని మఖచ్కల నగరంలోని ఓ పెట్రోల్ కేంద్రంలో పేలుడు సంభవించింది. 35 మంది మృతి చెందగా 100 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో చిన్నారులు ఉండగా గాయపడిన వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆరోగ్యశాఖ ఫస్ట్ డిప్యూటీ విక్టర్ ఫిసెక్కో మంగళవారం వెల్లడించారు. గాయపడిన వారిని మఖచ్కలలోని మెడికల్ ఇనిస్టిట్యూట్‌లకు తరలించి, చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం రాత్రి ఈ దుర్ఘటన జరిగిందని, దీనికిగల కారణాలు తెలియలేదన్నారు. ప్రతి ప్రాణాన్ని కాపాడే ప్రయత్నంలో వైద్యులు ఉన్నట్లు చెప్పారు. కాస్పియన్ సముద్రం ఒడ్డున ఉన్న ఈ నగరంలో జాతీయ రహదారిపై ఉన్న కార్ల సర్వీసింగ్ సెంటర్‌లో తొలుత మంటలు చెలరేగాయి. అవి క్రమంగా ఎదురుగా ఉన్న గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌కు వ్యాపించగా భారీ పేలుడు సంభవించింది. ఉవ్వెత్తున మంటల ఎగిసిపడి పరిసర ప్రాంతాలకు వ్యాపించాయి. ప్రమాదంపై తక్షణమే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 260 ఫైరింజన్లతో మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అనేక కార్లు మంటల్లో చిక్కుకున్నాయి. గాయపడిన వారిలో 13 మంది చిన్నారులు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మంటలు ఏకంగా 6,460 చదరపు మీటర్ల విస్తీర్ణంలో వ్యాపించాయని కారు మరమ్మత్తు జరుగుతున్న సమయంలో మంటలు చెలరేగి ఎదురుగా ఉన్న గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌కు వ్యాపించినట్టు రష్యా దర్యాప్తు కమిటీ పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాక్చాతుర్యం... ఆత్మస్తుతి

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ మరోమారు తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించారు. ఆత్మస్తుతిలో మునిగితేలారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళికల ఊసే ఎత్తలేదు. సంక్షేమ పథకాలనూ ప్రకటించలేదు. అభివృద్ధి మంత్రాన్నే జపిస్తూ ఐదేళ్లలో అభివృద్ధి చెందిన భారత్‌కు హామీనిచ్చారు. ఎన్నికల మాటున ప్రతిపక్షాలపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ కుటుంబ రాజకీయాలను దుయ్యబట్టారు. అవినీతి భూతాన్ని అంతమొందించడమే తన జీవిత లక్ష్యమని చెప్పుకున్నారు. ఏదిఏమైనా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పదోసారి ఎర్రకోట మీద నుంచి మోదీ చేసిన ప్రసంగం పాతమూసగానే సాగిందంటే ఆరోపణ కాబోదు. పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా మోదీ ప్రసంగం ఉంది. కృత్రిమ మేధస్సు కాలంలో మోదీ కోసం ప్రసంగాన్ని తయారు చేయడం గొప్పేమీ కాదుగానీ ఆయన 2014 నుంచి 2023 వరకు చేసిన ప్రసంగాల్లో సారూప్యత లేకపోలేదు. ప్రతి విజయానికి ఘనత తనదే అని చాటుకోవడం, వాస్తవాలను విస్తరించడం మోదీకి అలవాటు. గత హామీలను ప్రస్తావించకపోవడం, ప్రజల న్యాయమైన డిమాండ్లు, సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఆయనకు పరిపాటిగా మారింది. తాజా ప్రసంగం ద్వారా ఆయన తన వాక్చాతు ర్యాన్ని ప్రదర్శించుకున్నారేగానీ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల గురించి ప్రస్తావించలేదు. గతంలో వలే ఈసారి ఎలాంటి సంక్షేమ పథకాలనూ ప్రకటించారు. వచ్చే ఐదేళ్లల్లో భారత్ ప్రపంచ దేశాల్లో నం.3గా ఉంటుందని ఉద్ఘాటించారు. ఇది వినటానికి బాగానే ఉన్నా 2028 నాటికి భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని 2013 నాటి నివేదికలు సూచించడం ప్రస్తావనార్హం. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు, అనాలోచిత లాక్‌డౌన్లు వంటి చారిత్రక తప్పులు జరగకపోతే 2075 నాటికి రెండవ ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందన్న సూచనలు ఉన్నాయి. కానీ మోదీ అంతా తన కష్టఫలమన్నట్లు మాట్లాడతారు. జరిగే విషయాలను తాను సాధించినట్లు చిత్రీకరిస్తారు. ప్రగల్భాలు, ఆత్మస్తుతి మోదీకి కొత్తేమీ కాదు. 2014కంటే ముందు బలహీన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఉండేదని మోదీ చెప్పారు. వాస్తవానికి 2004 నుంచి 2014 వరకు భారత సగటు ఆర్థికవృద్ధి 7.8శాతంగా ఉంటే 2013-14లో 6.4శాతంగా ఉంది. మోదీ మాత్రం వాస్తవాలను పక్కకు పెట్టి అరచేతిలో స్వర్గం చూపించే చందంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను కొనసాగిస్తుంటారు. 77వ స్వాతంత్ర్య దినోత్స వాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి 90 నిమిషాలు మాట్లాడిన మోదీ 2024 లోక్‌సభ ఎన్నికల సమరానికి శంకాన్ని పూరించారు.

నిఘా నీడ

(మొదటిపేజీ తరువాయి)

విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా అధ్వర్యంలో కఠిన చర్యలకు ప్రణాళిక రూపొందించారు. విజయవాడ నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలులో ఉంచి, 200 సీసీ కేమేరాలతో నిఘా ఏర్పాటు చేశారు. 3వేల మంది పోలీసులను రంగంలోకి దించారు. ఇప్పటికే విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలకు నోటీసులిచ్చి అరెస్టుల పర్వం ప్రారంభించారు. ఈ విధానాల్ని విద్యుత్ ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు తప్పుపడుతున్నారు. చలో విజయవాడకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు భారీగా తరలివచ్చేందుకు సిద్ధమవ్వగా, ఎక్కడికక్కడే ముందస్తు అరెస్టులకు పాల్పడుతున్నారు. ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళనలు చేయడమే నేరంగా ప్రభుత్వం చూస్తోందని వాపోతున్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల నుంచి ఉద్యోగుల ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రభుత్వాన్ని విమర్శించినా, వ్యతిరేక ఉద్యమాలకు దిగిన ఉద్యోగ సంఘాల నేతలపై ప్రత్యేక దృష్టి సారించి, ఆ తర్వాత వారిపై శాఖాపరంగా, చట్టపరంగా చర్యలకు పాల్పడుతున్నారు. గతంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీ, ఇతరత్రా డిమాండ్ల కోసం చేపట్టిన 'చలో విజయవాడ' విజయవంతం కావడంతో జగన్ సర్కారులో ఆందోళన మొదలైంది. విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు పొడవునా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు తరలివచ్చి ప్రభుత్వంపై గర్జించారు. ఎన్ని ఆంక్షలు, ముందస్తు అరెస్టులు చేసినప్పటికీ, రెండు రోజుల ముందుగానే విజయవాడకు ఉద్యోగులు చేరుకున్నారు. ఆ తర్వాత చాలా మంది ఉద్యోగ సంఘాల నేతలను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి, ప్రభుత్వం పైచాశిక ఆనందం పొందిందనే విమర్శలున్నాయి.

సీపీఎస్ రద్దుపైనా అస్పష్టత

కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేయాలంటూ సుదీర్ఘకాలం నుంచి ఆందోళన చేస్తున్న సీపీఎస్ ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించలేదు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, మంత్రివర్గ ఉప సంఘ సమావేశంలో సీపీఎస్ రద్దు చేయకుండా, దాని స్థానంలో జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీమ్)ను తెరపైకి తెచ్చిన విషయం విదితమే. దీనిని మెజారిటీ ఉద్యోగ సంఘాలు వ్యతిరేకించాయి. నాడు జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు, పాదయాత్ర సమయంలోను సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుల్లోకి తేవాలని ఉద్యోగులు ఆయనకు వినతిపత్రం అందజేయగా... అందుకు అంగీకరిస్తూ గట్టి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చినే వెంటనే సీపీఎస్ రద్దు చేసి, దాని స్థానంలో పాత పెన్షన్ విధానం తెస్తానని భరోసా ఇచ్చారు. చాలా మంది ఉద్యోగులు జగన్ హామీల్ని నమ్మి ఆయనకు ఎన్నికల్లో మద్దతిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక సీపీఎస్ రద్దు సాధ్యం కాదని, ప్రభుత్వం తెలివిగా వ్యవహరించి దానికి ప్రత్యామ్నాయంగా జీపీఎస్ తెచ్చింది. ఇప్పటికే చాలా రాష్ట్రాల ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఆ తరహాగా జగన్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదంటూ సీపీఎస్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. సీపీఎస్ రద్దు చేయాలంటూ నాలుగేళ్ల నుంచి అనేక రూపాల్లో ఆందోళనలు చేస్తూ వచ్చారు. చివరకు సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. ఆయా ఉద్యమాల దశల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం కేసులు పెట్టింది. ప్రధానంగా సీపీఎస్ సంఘాలకు బాధ్యతలు వహిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, వారిని మానసికంగా, విధుల పరంగా వేధింపులకు ప్రభుత్వం పాల్పడుతోందన్న విమర్శస్తున్నాయి. హక్కుల సాధన కోసం ఉద్యమిస్తున్న తమను పోలీసు యంత్రాంగంతో అణచివేసే చర్యల్ని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

విజయవాడలో ఏఐవైఎఫ్ వినూత్న నిరసన

అర్ధనగ్నంగా భిక్షాటన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): నిరుద్యోగ సమస్య పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. మంగళవారం ఇక్కడి కాళేశ్వరరావు మార్కెట్ గాంధీ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ అధ్వర్యంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని కోరుతూ అర్ధ నగ్నంగా భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్ర బాబు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో పాలకులు విఫలం చెందారన్నారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకీ పెరుగుతోందని, పట్టించుకోవాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన భారతదేశం నిరుద్యోగ భారత్‌గా తయారవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యలు పట్టించుకోకుంటే వాళ్లు అడుక్కుతినాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల సమయంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చారు.. అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్న ఒక ప్రభుత్వ శాఖలో ఉద్యోగాలు భర్తీ చేయకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్, ప్రైవేటు వ్యక్తులకు ధారా దత్తం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యను పట్టించుకోవడం లేదని రాజేంద్ర బాబు విమర్శించారు. నిరుద్యోగుల సమస్యను పట్టించుకోక పోతే... పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల భార్గవ్, లంకా గోవిందరాజులు, సహాయ కార్యదర్శులు లంకే సాయి, ఎస్ లాల్ మోహన్ , సీహెచ్ శ్రీధర్, ఉపాధ్యక్షులు శీరం రవికుమార్, సింగంశెట్టి మోహన్ ప్రసాద్, బంక శివకృష్ణ, గాడి అజయ్, కే జాన్సన్ రెడ్డి, కే జనార్ధన్, ఏ రామకృష్ణ, అంజూరి సూరిబాబు, పి రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతితోనే మణిపూర్‌కు పరిష్కారం: మోదీ

న్యూఢిల్లీ: వర్గపోరులో అట్టుడుకుతున్న మణిపూర్ క్రమంగా శాంతిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. 'మణిపూర్‌కు దేశం అండగా ఉంది. ఆ రాష్ట్ర ప్రజలు మొదలు పెట్టిన శాంతి ప్రక్రియను దేశం ముందుకు తీసుకెళ్లాలి. శాంతి ద్వారానే పరిష్కారం సాధ్యం' అని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో తెలిపారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయని మోదీ అన్నారు. ఈశాన్యం ముఖ్యంగా మణిపూర్‌లో, దేశంలోని ఇంత ప్రాంతాల్లోనూ హింస జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోవడం, మహిళల గౌరవానికి భంగం కలగడం వంటి ఘటనలు జరిగాయి. కానీ శాంతి నెలకొంటున్నట్లు తాజా నివేదికలతో తెలుస్తోంది. మణిపూర్‌కు కష్టం కలిగితే ఆ బాధ మహారాష్ట్రకు తెలుస్తుందని, ఆసోంలో వరదలొస్తే కేరళ అశాంతికి గురవుతుందని, ఇది మనలోని ఐక్యతకు నిదర్శనమని ప్రధాని అన్నారు. కాగా, మణిపూర్‌లో హింసను ఆపేందుకు పారా మిలటరీ బలగాలను కేంద్రం మోహరించింది.

వినువీధిలో కొత్త నక్షత్రం

బెంగళూరు: వినువీధిలో కొత్త నక్షత్రం ప్రత్యక్షమైంది. భారత శాస్త్రవేత్తలు దీనిని కనిపెట్టారు. బెంగ ళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్‌కు చెందిన శాస్త్రవేత్తలు చేపట్టిన పరిశో ధనలో ఈ కొత్త నక్షత్రం గురించి తెలిసింది. ఈ నక్షత్రానికి హెచ్‌ఈ 1005 - 1439గా నామకరణం చేశారు. 'కార్బన్ ఎన్‌హాన్స్‌డ్ మెటల్ పూర్ (సీఈఎంపీ) స్టార్‌గా వర్గీకరించారు. కొత్త నక్షత్రం రెండు న్యూట్రాన్ - క్యాప్చర్ ప్రాసెసెస్‌ల కాంబినేషన్‌తో ఏర్పాటైనట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. వీటిలో ఒకటి స్లో (ఎస్-) న్యూట్రాన్ - క్యాప్చర్ ప్రాసెస్ కాగా, రెండవది ఇంటర్మీడియట్ (ఐ-) న్యూట్రాన్ - క్యాప్చర్ ప్రాసెస్ అని వెల్లడించారు.

భవిష్యత్తుపై ప్రణాళిక ఉంటేనే దేశాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

దేశాభివృద్ధి పెద్దగా లేదు. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణల వల్ల శక్తిమంతంగా మారాం. 90ల్లో వచ్చిన ఇంటర్నెట్ రివల్యూషన్ వల్ల ప్రపంచంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. 21వ సెంచరీ మనదే.. అనుమానం లేదు'అని చంద్రబాబు అన్నారు.

అభివృద్ధిని కోరుకునే నగరం విశాఖ

"రాష్ట్రంలోనే కాకుండా దేశంలో ఫాస్టెస్ట్ గ్రోయింగ్ సిటీ విశాఖ నగరం... నేను ఎప్పుడూ అభిమానించే నగరం విశాఖ నగరం అన్నారు. విశాఖ నగరం. కులమతాలు, ప్రాంతీయ భావాలకు అతీతంగా అభివృద్ధి కోరుకునే నగరం విశాఖ. దేశంలో ఎక్కడైనా రిటైర్ కావా లన్నా... ఎక్కడ మంచి సిటీ ఉందని ఆలోచించినా...ఆ జాబితాలో విశాఖ మొదటి స్థానంలో ఉంటుంది. ఇది మనందరికీ గర్వకారణం. మా దూరదృష్టి వల్లే నేడు హైదరాబాద్‌లో ఎక్కువ తలసరి ఆదాయం వస్తోంది. విభజన తర్వాత స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2029కి పిలుపునిచ్చాం. విజయవాడ-గుంటూరు మధ్య అమరావతి నగరం తల పెట్టాం. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా మార్చాలని అనుకున్నాం. మా హయాంలో ఐదేళ్లలో 10ప్లస్ గ్రోత్ రేట్ సాధించాం. విశాఖ ప్రజలు కూడా అమరావతి కావాలని కోరుకుంటున్నారు. విజన్ 2047 డాక్యుమెంట్ డ్రాఫ్ట్ మాత్రమే. దీనిపై మేధావులు చర్చించాలి' అని చంద్రాబాబు అన్నారు.

బలమైన ఆర్థికశక్తిగా భారత్

ఆధునిక భారతదేశం లో తనకున్న వనరులతో అనూహ్య ఫలితాలు సాధిస్తోందని, దేశ ప్రజల సామర్థ్యం, నైపుణ్యం, యువశక్తి కారణంగా జి 20 సభ్యదేశాల కన్నా మన దేశ ఆర్థికవృద్ధి రేటు అగ్రస్థానంలో వుందని, ఈ పురోగతి ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో అమెరికా, చైనా ల తర్వాత భారత్ బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు అన్నారు. అదే జరిగితే ప్రపంచ పెట్టుబడులకు, వనరులు, నైపుణ్యాలకు భారతదేశం గమ్యస్థానం అవుతుందన్నారు. ఫలితంగా స్వాతంత్ర భారతం శతాబ్ది ఉత్సవాలు జరుపుకునే 2047 వ సంవత్సరపు శుభసందర్భానికి అత్యంత బలమైన, అభివృద్ధి చెందిన జాతిగా మన దేశం అవతరిస్తుందన్నారు. క్రీ.పూ. 500 వ సంవత్సరం నుంచి క్రీ. శ. 1758 వరకు భారతదేశం ప్రపంచంలోనే ఒక విస్తృతమైన, బలీయమైన ఆర్థిక వ్యవస్థగా వెలుగొందిందన్నారు. స్వాతంత్ర భారతం శతవార్షిక సంబరాలు జరుపుకునే నాటికి తిరిగి మనం గత వైభవాన్ని సాధించుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. సుదీర్ఘమైన ప్రణాళికలు, ప్రజల భాగస్వామ్యం, అత్యుత్తమ ప్రభుత్వ పాలసీలు ద్వారా 2047 నాటికి అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చునన్నారు. 1991 లో చేపట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితాలను ముందుగానే ఊహించి స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం విజన్ - 2020 డాక్యుమెంట్ ను తీసుకువచ్చానని, 1995-2004 మధ్య ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రగతిని పరుగులు తీయించానన్నారు. దానికి సజీవ సాక్ష్యమే సైబరాబాద్ మహానగరమని తెలిపారు. సైబరాబాద్ సృష్టితో హైదరాబాద్ రోజురోజుకూ మారుతున్న తీరును మనం రోజూ చూస్తున్నాం అని, అదే స్ఫూర్తి, ఆలోచనలతో తిరిగి 2014 నుంచి 2019 మధ్య నూతనంగా ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 'సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ విజన్ - 2029' అనే విజన్ డాక్యుమెంట్ తయారు చేశామన్నారు. దాని అమలు ద్వారా దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో నాడు 10.8 శాతం వృద్ధిరేటు సాధించిందన్నారు.

ఇక అరటి వంతు!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి తగినంత సరఫరా లేకపోవడంతో అరటి పండ్లకు డిమాండ్ ఏర్పడిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

బెంగళూరులో విక్రయించే అరటి పండ్లలో మెజారిటీ వాటా తమిళనాడు రాష్ట్రం నుంచే వస్తాయి. ఎలక్కిబలే, పచ్‌బలే రకాలను బెంగళూరు వాసులు ఎక్కువగా ఇష్టపడి కొంటారు. తమిళనాడు నుంచి ఈ రకం పండ్ల సరఫరా తగ్గిపోయింది. సుమారు నెల రోజుల క్రితం బిన్నీపేట్ మార్కెట్‌కు 1,500 క్వింటాళ్ల ఎలక్కిబలే సరకు వస్తే... ప్రస్తుతం అది 1000 క్వింటాళ్లకు పడిపోయినట్లు అధికారులు తెలిపారు. బెంగళూరుకు వచ్చే సరకు తుమకూరు, రామనగర, చిక్‌బళ్లాపూర్, అనేకల్, బెంగళూరు రూరల్‌కు పంపిణీ అవుతుందని పేర్కొన్నారు. తమిళనాడులోని హోసూరు, కృష్ణగిరి నుంచి ఎక్కువగా కర్నాటకు అరటి రవాణా అవుతుందని మార్కెట్ అధికారులు తెలిపారు. సరఫరా తగ్గిపోవడంతో హోల్‌సేల్‌లో ఎలక్కిబలే రకం కేజీ రూ.78, పచ్‌బలే రకం రూ.18-20 పలుకుతోందని చెప్పారు.

అన్ని ఖర్చులూ కలుపుకొని వ్యాపారులు వాటిని కేజీ రూ.100, రూ.40 చొప్పున విక్రయిస్తున్నారని తెలిసింది. మరి కొన్ని రోజుల్లో ఓనం, వినాయక చవితి, విజయ దశమి పండగలు రానున్న నేపథ్యంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఓ మండి వ్యాపారి అభిప్రాయపడ్డారు.

ఆసియా క్రీడలకు వినేష్ ఫోగాట్ దూరం

న్యూఢిల్లీ: చైనాలో జరగనున్న ఆసియా క్రీడలు-2023 మహిళల రెజ్లింగ్‌లో బంగారు పతకం పక్కాగా సాధించి పెడుతుందనుకున్న రెజ్లర్ వినేష్ ఫోగాట్ షాకింగ్ న్యూస్ చెప్పింది. గాయం కారణంగా తాను ఈ క్రీడల్లో పాల్గొనడం లేదని వెల్లడించింది. మంగళవారం (ఆగస్ట్ 15) సోషల్ మీడియా ద్వారా ఈ వార్తను ఆమె అభిమా నులకు తెలియపర్చింది. 'మోకాలి గాయం కావ డంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె ఆసియా క్రీడల నుంచి తప్పుకోవాల్సి వస్తోంది. ఈ గాయానికి ఆమె సర్జరీ చేయించుకోవాల్సి ఉంది' అని పేర్కొంది. 28 ఏళ్ల వినేష్. 2018 ఆసియా క్రీడల్లో బంగారు పతకం సాధించింది. ఈసారి కూడా పసిడి పతకం నిలబెట్టుకోవాలన్నది తన కల అయినా... దురదృష్టవశాత్తూ గేమ్స్‌కు దూరం కావాల్సి వస్తోందని వినేష్ వాపోయింది. ఈ బాధాకరమైన వార్తను మీతో పంచుకోవాలని అనుకున్నాను. ఆగస్ట్ 13న ట్రెనింగ్‌లో నా మోకాలికి గాయమైందని తెలిపింది.

వికేంద్రీకరణే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పరేడ్‌ను పరిశీలించారు. ప్రభుత్వ ప్రగతిని తెలియజేసే విధంగా రూపొందించిన 13 అభివృద్ధి శకటాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడుతూ వికేంద్రీకరణను రాష్ట్ర ప్రభుత్వం ఒక విధానంగా మార్చుకుందని, దీనిలో భాగంగానే 13 జిల్లాలను విభజించి, మరో 13 జిల్లాలను ఏర్పాటు చేశామన్నారు. మూడు రాజధానులను కూడా మూడు ప్రాంతాల హక్కుగా అమలు చేయబోతున్నామ న్నారు. అలాగే దాదాపు 15 వేలకు పైగా గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి వికేంద్రీకరణలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించామన్నారు. ఇది 76 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో మరే ప్రభుత్వం చేయని గొప్ప మార్పుగా సీఎం అభివర్ణించారు. లంచాలు, వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేశామని, ఎన్నికల హామీల్లో 99.05 శాతం అమలు చేసి రికార్డు నెలకొల్పామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలన్నీ అక్కచెల్లెమ్మల పేరు మీదే ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు దాదాపు 2 లక్షల 31 వేల కోట్లను నేరుగా ప్రజలకు అందించామని చెప్పారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకే కేంద్రాలతో గ్రామ స్వరాజ్యానికి అర్థం తెచ్చామన్నారు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదని, అన్ని సేవలు ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. వడివడిగా పోలవరం పనులు జరుగుతున్నాయని, 2025 జూన్ నాటికి ప్రాజెక్టు పూర్తి అవుతుందని స్పష్టం చేశారు. వెలిగొండలో మొదటి టన్నెల్ పూర్తి చేశామని... రెండో టన్నెల్ పనులు త్వరలోన పూర్తవుతాయని చెప్పారు. సామాజిక న్యాయం నినాదం కాదు, దాన్ని అమలు చేసి చూపామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు అన్నింటిలోనూ అత్యధిక ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు. రైతులకు పెట్టుబడి కోసం రైతు భరోసా అందిస్తున్నామని, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా విత్తనం నుంచి అమ్మకం వరకూ రైతుకు అండగా నిలుస్తున్నామన్నారు. పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు అదనంగా ఆదాయం వచ్చేలా చేశామని తెలిపారు. మూతపడిన చిత్తూరు డెయిరీకి జీవం పోశామని అన్నారు. భూ వివాదాల పరిష్కారం కోసం సమగ్ర సర్వే చేపట్టామని చెప్పారు. ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం మా నవరత్నాల పాలన అన్నారు. 50 నెలల తమ ప్రభుత్వ పాలనలో గ్రామ స్వరాజ్యానికి అర్థం తెచ్చామని జగన్ చెప్పారు. ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్ ఇస్తున్న ప్రభుత్వం మనదేనన్నారు. భూ వివాదాలకు ఆస్కారం లేకుండా రైతన్నకు మంచి చేస్తున్నామని, 1.54 లక్షల ఎస్టీ రైతులకు 3.23 లక్షల ఎకరాల్లో పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు 68 శాతం మంత్రి పదవులు కల్పించినట్లు వెల్లడించారు. శాసన సభ స్పీకర్‌గా బీసీ, శాసన మండలి చైర్మన్‌గా ఎస్సీని నియమించామని, 139 బీసీ కులాలకు 56 ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోర్టుల నిర్మాణం ప్రారంభమయ్యాయని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరసగా మూడేళ్లు ఏపీనే నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. రాష్ట్రానికి గత నాలుగేళ్లలో రూ.67,196 కోట్ల పెట్టుబడులు రాగా... కొత్తగా 127 భారీ పరిశ్రమల ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13.42 లక్షల కోట్లకు ఎంవోయూలు చేసుకున్నామని, కొత్తగా ఎంఎస్ఎంఈ యూనిట్లు 2,00,995 ప్రారంభమయ్యాయని అన్నారు. ఇక విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని, నాడు-నేడుతో 45 వేల ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ విధానం, ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లు, భోజనం, వసతి ఖర్చుల కోసం రూ.20 వేల వరకు వసతి దీవెన, రోజుకో మెనూతో పౌష్టికాహారంగా గోరుముద్ద అమలు, డిగ్రీ స్థాయిలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్, ట్రిపుల్ ఐటీల్లో పెండింగ్‌లో ఉన్న 3,295 టీచింగ్ పోస్టుల భర్తీ వంటి అనేక చర్యలు విద్యారంగ మార్పులకు దోహదపడ్డాయన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాడు-నేడు, ఒకేసారి 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను నిర్మాణం చేపట్టడం, వైద్య శాఖలో ఏకంగా 53,126 పోస్టుల భర్తీ, 108, 104 సేవల కోసం కొత్తగా 1,514 వాహనాల కొనుగోలు వంటి అనేక చర్యలు వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికాయన్నారు. పేదలు ఇంగ్లీష్ మీడియం చదువుకోవద్దని వాదించడం అంటరానితనమే, పేదలు వైద్యం చేయించుకునే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత సేవలు అందకుండా చేయడం కూడా అంటరానితనమే, పేదలకు ఇళ్లు ఇవ్వకూడదని అడ్డుకోవడం కూడా అంటరానితనమే, పేదల సహనాన్ని పరీక్షించడం కూడా అంటరానితనమే, పేదలు గెలిచే వరకూ, వారి బతుకులు బాగుపడే వరకూ యుద్ధం చేస్తూనే ఉంటామని సీఎం పునరుద్ఘాటించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పేదవర్గాలకు భావపరమైన, ఆలోచనాపరమైన మరింత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇవ్వటానికి త్రికరణ శుద్ధిగా పేదల, ప్రజా ప్రభుత్వంగా కట్టుబడి ఉన్నామని స్పష్టం చేస్తూ ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

24న 'చలో దిల్లీ' జయప్రదం చేయాలి

రైతుసంఘాల సమన్వయ సమితి పిలుపు

విశాలాంధ్రబ్యూరో–అమరావతి: కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా, ఈనెల 24వ తేదీన దిల్లీలో జరిగే సదస్సులో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని రెండో దశ పోరాటానికి సన్నద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డేశోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిధులతోనూ, ప్రజలు చెల్లించిన పన్నులతోను శ్రామిక వర్గం కష్టంతో నిర్మించిన ప్రభుత్వరంగాన్ని తెగనమ్మా టానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గ మన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల సీనియర్ సిటిజన్ల కార్యాలయంలో జాతీయ జెండాను రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడు తోందని... అందులో భాగంగానే మూడు వ్యవసాయ నల్ల చట్టాలనుమ కేంద్ర ప్రభుత్వం తెచ్చిందన్నారు. వాటిని తిప్పి కొట్టడానికి రైతాంగం చారిత్రాత్మక పోరాటం చేసిందని గుర్తు చేశారు. దొడ్డి దారిన రద్దు చేసిన చట్టాలను మళ్లీ తెచ్చేందుకు ప్రయత్నించడం రైతాంగాన్ని మోసగించడమేనని దుయ్యబట్టారు. రైతాంగం గిట్టుబాటు ధరలు, రుణమాఫీ తదితర అంశాలపై పోరాటం చేస్తుంటే... కేంద్రం కేసులు పెడుతోందన్నారు. పీఎం కేర్ పేరుతో సేకరించిన వివరాలను పేద అవసరాలకు ఖర్చు చేయడం లేదని, వసూలు చేసిన లక్షల కోట్లు ఎటుపోతున్నాయో తెలియటం లేదన్నారు. అటు కార్పొరేట్లకు మాత్రం లక్షల కోట్ల రూపాయలను కుమ్మరిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు సేవలు చేసే స్వచ్ఛంద సంస్థలపై ఆంక్షలు పెట్టడం సిగ్గమాలిన పని అని అయన అన్నారు. మణిపూర్, హరియాణాలో మారణకాండ సృష్టించి దేశ సమగ్రతకు, మత సామరస్యానికి కేంద్రం విఘాతం కలిగిస్తోందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజ్యాంగాన్ని కాపాడుకో వాలని, దేశ సమగ్రత కోసం 'మోదీ హఠావో–భారత్ బచావో' నినాదంతో పని చేయాలని, వ్యవసాయాన్ని, రైతులను రక్షణ కోసం ఉద్యమించాలన్నారు. తొలుత ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు, ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకులు కాసాని గణేష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు కోగంటి ప్రసాదు, కోగంటి కోటయ్య, సుంకర మురళి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు ఆర్ పిచ్చయ్య దేశభక్తి గేయాన్ని ఆలపించారు.

గిడుగు రుద్రరాజుతో రామకృష్ణ భేటీ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం సాయంత్రం విజయవాడ లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌కు రామకృష్ణ విచ్చేశారు. ఈ సందర్భంగా గిడుగుకు ఆయన స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తాజా రాజకీయ పరిస్థితులపై వారిద్దరూ చర్చించినట్లు సమాచారం.

దేశ సమగ్రత పరిరక్షణకే వైసీపీ ప్రాముఖ్యత

పార్టీ కేంద్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని పరిరక్షించడంలో వైసీపీ ముందు ఉంటుందని ఎంపీ, పార్టీ రాష్ట్ర సమన్వయ కర్త వీ.విజయసాయిరెడ్డి అన్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధులను స్మరించుకుని, వారి చిత్రపటాలకు విజయసాయి రెడ్డితోపాటు ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పార్టీ ముఖ్య నేతలు పూలమాలలేసి నివాళులర్పించారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ, నేడు 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషంగాను, గర్వంగాను ఉందన్నారు. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితమే మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, ప్రజాస్వామ్యమని అన్నారు. ఆ త్యాగధనుల త్యాగాల్ని ఎన్నటికీ మర్చిపోకూడదని, మనకు సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు, ప్రతి రాజకీయ పార్టీ మీద ఉందని చెప్పారు. దేశంలోని అనేక రాజకీయ పార్టీలు, రాష్ట్రంలోని ప్రధాన విపక్షం కూడా వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ, కొన్ని వేర్పాటువాద శక్తులను బలపరుస్తుంతుందని, ఇది చాలా శోచనీయమైన విషయమని అన్నారు. అలాంటి విపక్షాల కుయుక్తుల్ని, కుతంత్రాలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్ దేశ సమగ్రతకు, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అహర్నిశలు కృషి చేస్తారన్నారు. వైసీపీ దేశభక్తి కలిగిన పార్టీ అన్నారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్దిష్టమైన ఆలోచనతో పాటు ఒక అజెండాతో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పోతుల సునీత, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్‌హోంకు సీఎం జగన్ దంపతులు

విశాఖ పర్యటనతో చంద్రబాబు గైర్హాజరు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఏర్పాటు చేసిన ఎట్‌హోం కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. గవర్నర్‌గా నజీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎట్‌హోం కార్యక్రమం జరగడం ఇదే తొలిసారి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు కొట్టు సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, జోగి రమేశ్, చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏపీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తదితరులు పాల్గొన్నారు. విశాఖ పర్యటనలో ఉన్న కారణంగా ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు గైర్హాజరయ్యారు.

ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మోదీ పాలన

జేవీ సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర–విశాఖ: కేంద్రంలో అధికారం లో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పరిపాలన సాగిస్తూ మతోన్మాద, హింసా రాజకీయాలు చేస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి విమర్శిం చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాను సీపీఐ, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఎస్.ఎం.మౌలాలి ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా జరిగిన సమా వేశంలో జె.వి.సత్యనారాయణ మూర్తి మాట్లా డుతూ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్, ఈడీ, సీబీఐ, ఆర్‌బీఐ, ఐటీ తదితర వ్యవస్థలను మోదీ తన ఆధీనంలోకి తీసుకుని పాలన సాగిస్తున్నారని అన్నారు. దేశ ద్రోహ చట్టంపై అనేక ఆందోళనలు, నిరసనలు చేపట్టినా చట్టాన్ని వెనక్కి తీసుకోవడంలో కేంద్రం తాత్సారం చేస్తే సుప్రీం కోర్టు కలుగజేసుకొని ఆదేశాలు ఇచ్చిందన్నారు. అయితే దాని స్థానంలో మరో చట్టాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. పార్లమెం టు జరగని రోజుల్లో వారికి అనుకూలంగా చట్టాలను చేసుకుంటున్నారని తెలిపారు. కేంద్ర మంత్రి వర్గంలో ఉన్నవారందరూ వివిధ రకాల నేరారోపణలు ఎదుర్కొంటున్నారని అన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు కృషి చేయకుండా తాత్సరం చేస్తున్నారని, ఆ అంశంపై మాట్లాడడానికి సమయం కేటాయిం చడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, సి.ఎన్.క్షేత్రపాల్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మధరావు, జి.ఎస్.జె. అచ్యుత రావు, సీపీఐ నాయకులు జి.కాసులరెడ్డి, ఎ.ఆది నారాయణ, శ్రీను, రజాక్, నల్లయ్య, అప్పన్న, దేవుడమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదులను తరిమికొట్టేందుకు

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ

విశాలాంధ్ర–రాజమండ్రి: స్వాతంత్ర్య ఉద్యమంలో ఎప్పుడూ పాల్గొనని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేడు దేశాన్ని పాలిస్తున్నారని, మతం, కులం పేరుతో ప్రజలను విభజిస్తున్న ఈ పాలకులను తరిమికొట్టేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సీపీఐ కార్యాలయాలు, గ్రామాలు, వార్డులలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ స్థానిక కార్యాలయం వద్ద జాతీయ జెండాను అక్కినేని వనజ ఆవిష్కరించారు. జట్ల సంఘం కార్యాలయం, అపరాల సెక్షన్ వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి అధికారంలోకి రావాలని, రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసి మనువాద శాస్త్రాన్ని ప్రవేశపెట్టాలని చూస్తోందన్నారు. దేశాన్ని కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసి బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఇటువంటి అప్రజాస్వామిక, నిరంకుశ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు విశ్రమించేది లేదని, ఈ దేశాన్ని కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున ప్రజలందరూ ఐక్యంగా పోరాటాలు చేయవలసిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. తాటిపాక మధు మాట్లాడుతూ గతంలో గుజరాత్, ఇటీవల మణిపూర్, హరియానా తదితర రాష్ట్రాల్లో ప్రజల మధ్య విభేదాలు తీసుకువచ్చి, ప్రజలను నిర్దాక్షణ్యంగా హత్య చేస్తున్న ప్రత్యక్ష ఘటనలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. వీటిని నివారించకపోతే భవిష్యత్తులో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని ఖూనీ చేసి ఫాసిస్టు విధానాలను అమలు చేసే ప్రమాదం ఉందన్నారు. దీనిని ప్రజలందరూ తిప్పి కొట్టవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, జట్ల సంఘం అధ్యక్షులు కుండ్రపు రాంబాబు, పార్టీ సహాయ కార్యదర్శి రేఖ భాస్కర్ రావు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు జ్యోతిరాజు, ఎ.సత్యనారాయణ, లక్ష్మణ్, చింతలపూడి సునీల్, పార్టీ సీనియర్ నాయకులు యడ్ల లక్ష్మి, సీపీని రమణమ్మ, నల్ల రామారావు, వాసపల్లి సూర్యనారాయణ, జి.రామారావు, కె.శ్రీనివాస్, జట్ల సంఘం నాయకులు దేవుడు బాబు, వెంకటరావు, అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల ప్రయోజనాల రక్షణకే

మణిపూర్ ఘర్షణలపై డీవీవీఎస్ వర్మ

విశాలాంధ్ర – ఒంగోలు: మణిపూర్ అల్లర్లు వాస్తవంలో పైకి కనిపిస్తున్న రెండు తెగల మధ్య ఘర్షణలు కాదనీ, వీటి వెనుక ఆశ్రిత పెట్టుబడుదారుల సొంత ప్రయోజనాలు ఉన్నాయని దీపం మాసపత్రిక సంపాదకులు డీవీవీఎస్ వర్మ అన్నారు. మంగళవారం ఆసరా అధ్వర్యంలో సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో కమ్యూనిజం మాసపత్రిక సంపాదకులు ఎంసీ వెంటేశ్వర్లు అధ్వర్యంలో మణిపూర్ ఘర్షణలపై సభను నిర్వహించారు. సభలో ప్రధాన వక్తగా పాల్గొన్న వర్మ మాట్లాడుతూ, మణిపూర్‌లో ఆ రాష్ట్ర హైకోర్టు మోయితీ తెగలకు రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్పు ఇవ్వడంతో ఘర్షణలు ప్రారంభమయ్యా యన్నారు. రాష్ట్రంలో మయితే తెగలు మెజార్టీ.. అయితే కుకీలు, నాగాలు మరి కొన్ని తెగలు మైనార్టీలన్నారు. మైనార్టీ తెగ కుకీలు ఆందోళనకు దిగగా మయితేలు వారికి వ్యతిరేకంగా హింసాత్మక ఘటనలకు పూనుకున్నారని వర్మ తెలిపారు. ఘర్షణలు తీవ్ర రూపం దాల్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపేందుకు ప్రయత్నించకుండా..మయితేలకు పరోక్షంగా మద్దతు పలికాయని చెప్పారు. వాస్తవంలో ఇది పైకి కనబడే రిజర్వేషన్ సమస్య కాదనీ, దీని వెనుక ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మణిపూర్ ఈశాన్య రాష్ట్రాలలో ఖనిజ సంపద అపారంగా ఉంది. దానిని తమ ఆశ్రిత పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి గిరిజన షెడ్యూల్ చట్టాలు అడ్డంకిగా ఉన్నాయన్నారు. వాటిని అధిగమించడానికి రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఆశ్రిత పెట్టుబడిదారులకు ఖనిజ సంపద దోచి పెట్టాలన్న కుట్ర దాగి ఉందన్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మయితే తెగకు చెందిన వారని, ఆ విధంగా మెజార్టీ ప్రజలను ఓటు బ్యాంకుగా మార్చుకోవడం... ఈశాన్య రాష్ట్రాల గిరిజనులలో హిందూ మతతత్వ భావజాలాన్ని వ్యాప్తి చేయడం కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందుకే మోదీ మౌన ముద్ర దాల్చారని వర్మ అన్నారు. ఈ సభలో నల్లూరి వెంకటేశ్వర్లు, ఆసరా అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు, సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, ఆసరా కార్యవర్గ సభ్యులు రామినేని శివ నాగేశ్వరరావు, నాతాని బ్రహ్మానందం, సీపీఐ సీనియర్ నాయకులు యు. ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ ఖాతాలు, పర్మినెంట్‌పై

ప్రభుత్వానికి నాన్చివేత ధోరణి తగదు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు

విశాలాంధ్ర–విజయవాడ : మున్సిపల్ పర్మినెంట్ కార్మికుల జీపీఎఫ్ ఖాతాలు తెరవటంలో, మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ ఒప్పంద సిబ్బందిని క్రమబద్ధీకరించడంపై రాష్ట్ర ప్రభుత్వానికి నాన్చివేత ధోరణి తగదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆసుల రంగనాయకులు అధ్యక్షతన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో పని చేస్తున్న 65 వేల మంది కార్మికుల సమస్యల పరిష్కారంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. నాలుగు సంవత్సరాలు గడిచినా కార్మిక సమస్యలపై చొరవ చూపని వైసీపీ ప్రభుత్వానికి ఉద్యోగులు, కార్మికులు తగిన బుద్ధి చెబుతారన్నారు. సీపీఎస్ రద్దు అంశం అటకెక్కించి, గ్రాట్యూటీ చెల్లింపులు చేయకుండా కార్మిక శాఖ మంత్రి ఈ ప్రభుత్వంలో ఉత్సవ విగ్రహంలా ఉన్నారని విమర్శించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ 2022 జులైలో జరిగిన మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం జరిపిన చర్చల్లో ఏ అంశాలు పరిష్కరిస్తామని నాడు అంగీకరించారో ఏడాది గడిచినా ఉలుకు పలుకు లేకుండా ఉద్యమాలను నీరుగార్చారని చెప్పారు. ఫైనాన్స్ కమిటీలో పెండింగ్‌లో ఉన్నాయని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామంటూ సంబంధిత అధికారులు కార్మికుల సమ్మెను అవమానిసున్నారని, ఈ దశలో ఉద్యమ కార్యాచరణకు సన్నద్ధమవ్వాలని సమావేశం తీర్మానించిందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటమాల్యాద్రి, భజంత్రి శ్రీనివాస్, దొరస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షులు కె.మల్లీశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్, కార్యదర్శులు కె.సత్యనారాయణ, దుర్గమ్మ, కోశాధికారి తాడికొండ వాసు హాజరయ్యారు.

ఆర్టీసీ హౌస్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో మంగళవారం 77వ స్వాంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ ద్వారకా తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మహనీయుల త్యాగాల ఫలంతో స్వాతంత్ర్యం సాధించిన తర్వాత దేశంలోని అన్ని రంగాల్లో అభివృద్ధి కొనసాగిందన్నారు. ఆర్టీసీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సీఎం జగన్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశామని, అందువలన ప్రభుత్వ ఉద్యోగుల తరహాగా, ఆర్టీసీ ఉద్యోగులు కూడా వేతనాల్ని పొందుతున్నారని చెప్పారు. ఆర్టీసీలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాల ద్వారా భర్తీ చేశామన్నారు. ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చేందుకు అధికారులు, సిబ్బంది ఉద్యోగులు కృషి చేయాల్సిన అవసరముందని చెప్పారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన 19 మంది ఉద్యోగులకు ఆయన అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో సత్వర న్యాయం

హైకోర్టు సీజే ధీరజ్‌సింగ్ ఠాగూర్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించేందుకు వీలుగా ఇటీవల కాలంలో న్యాయవ్యవస్థలో కృత్రిమ మేథస్సు (ఏఐ)తోపాటు వివిధ నూతన సాంకేతికతలను అనుసరిస్తున్నట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాగూర్ చెప్పారు. హైకోర్టులో ఇప్పటికే ఏఐతో వివిధ కేసుల్లో తీర్పులు వెలువరిస్తున్నామని, కోర్టు రికార్డుల డిజిటలీకరణ చేస్తున్నామన్నారు. నేలపాడులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను హైకోర్టు సీజే ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ ఠాకూర్ మాట్లాడుతూ హైకోర్టులో నూతన భవనం త్వరలో అందుబాటులోకి రానుందని, ప్రస్తుతం స్థలాభావం సమస్య పరిష్కారం కాబోతుందని చెప్పారు. హైకోర్టులోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన రోజు అని, మహానుభావుల పోరాటాలు, త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. దేశ రక్షణకు నిరంతరం పాటుపడే సాయుధ దళాలకు ప్రజలు కృతజ్ఞతతో ఉండాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్, బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఘంటా రామారావు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు జానకీ రామిరెడ్డి, దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేశ్ కుమార్ కైత్, రాష్ట్ర హైకోర్టుకు చెందిన న్యాయమూర్తులు, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ హరనాథ్, పీపీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

సామాజిక స్ఫూర్తి నింపుతున్న 'వీఐటీ'

ప్రజల ప్రాణాలు కాపాడిన వారికి యాజమాన్యం సత్కారం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: సమాజానికి ఎంతో కృషి చేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడటానికి తమ ప్రాణాలను సైతం లెక్కచేయని వీరులను గుర్తించి ప్రతి ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా వారిని ఘనంగా సత్కరించి నగదు ప్రోత్సాహకాలను ఇస్తూ వీఐటీ విశ్వవిద్యాలయ యాజమాన్యం ప్రజల్లో సామాజిక స్ఫూర్తి నింపుతోందని డాటా, ఎనలిటిక్స్, ఏఐ, ఎల్టీఐ మైండ్ ట్రీ ఈవీపీ అండ్ గ్లోబల్ హెడ్ జితేంద్ర చక్రవర్తి పుచ్చ కొనియాడారు. వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వీఐటీ విద్యలోనే గాక, సామాజిక కార్యక్రమాల్లోనూ ముందంజలో ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలు రక్షించిన ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, కానిస్టేబుల్ కార్తీక్‌లను, ప్రమాదకరమైన వ్యర్థాలను తొలగించడంలో విశేష కృషి చేస్తున్న మున్సిపల్ కార్మికులు నాగేంద్రం, జి.లక్ష్మయ్య, వైద్యరంగంలో డాక్టర్ సీహెచ్ రత్నమోహన్, ఎన్.రామకృష్ణారావును ఘనంగా సత్కరించి ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు. వీఐటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్కే ఖాదీర్ పాషా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఫలాలు దక్కేందుకు మరో పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర–ఏలూరు: దేశ స్వాతంత్ర్య ఫలాలు అందరికీ దక్కేందుకు మరో పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ తెలిపారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి అధ్వర్యంలో ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షతన మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది బలిదానాలు చేసి ఆంగ్లేయులపై వీరోచితంగా పోరాడి ఈ దేశ దాస్య శృంఖలాలు తెంచి 1947 ఆగస్టు 14న మన దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో నేడు మనమంతా దేశంలో పెరుగుతున్న మత ఛాందసవాదులను ఎదిరించాలని అన్నారు. తద్వారా మన దేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థాయిగా నిలబెట్టిన మత సామరస్యాన్ని కాపాడాలని అందుకు కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ స్వాతంత్ర్య పోరాట ఫలాలను ప్రజలకు అందించడంలో వైఫల్యం చెందాయని విమర్శించారు. నాలుగు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెచ్చరిల్లిపోతున్నా కేంద్ర ప్రభుత్వం కనీసం వాటిని అరికట్టడానికి ఒక్క చర్య కూడా చేపట్టలేదని, ఇప్పటికైనా మణిపూర్‌లో హింసను అరికట్టి, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ పాలనను అంతమొందించడానికి సీపీఐ శ్రేణులు, ప్రజా సంఘాలు ఐక్య పోరాటాలు చేయాలని అన్నారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉధృతం చేసి అనేకమంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు జైలు జీవితాన్ని అనుభవించారని, తమ ప్రాణాలను, ఆస్తులను సర్వస్వాన్ని త్యాగం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి, ఏరియా కార్యవర్గ సభ్యులు తెర్లపు శ్రీను, కొల్లూరి సుధారాణి, మావూరి విజయ, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, హకీమ్, బళ్ల కనకదుర్గారావు, ఏరియా సమితి సభ్యులు పోటేలు పెంటయ్య, బుగ్గల ప్రభాకర్, గేదెల నాగేశ్వరరావు, పోలా భాస్కరరావు, శుబ్దార్ ఖాన్, కొండేటి రాంబాబు, ఉప్పులూరి రవి, దొడ్డిపాము కుమార్, అజీజ్, ఆలీ, మెకానిక్స్ అసోసియేషన్ నాయకులు కొప్పిశెట్టి వేంకటపతి, గ్రంధి కిషోర్, యు.కేశవ, విక్రమ్, సందీప్, తెర్లాపు ప్రియాంక, పూజ్య లక్ష్మీ అరుణ, లక్ష్మీ, భవాని, గోర్లి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

కలలు అమ్మిన మోదీ

పది లక్షల రూపాయల అద్దె చెల్లించి మంగళవారం ప్రధానమంత్రి మోదీ ఎర్రకోట బురుజుల మీద నుంచి పదవ సారి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేశారు. ఈ ప్రసంగంలో షరా మామూలుగా ఆయన అనేక అంశాలు ప్రస్తావించారు కానీ దేశవాసులందరినీ పరివారజనం అంటే జనమంతా తన కుటుంబ సభ్యులు అని ప్రస్తావించారు. తనను ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల మీద దృష్టి లేకుండా మోదీ ఒక్క మాట కూడా మాట్లాడరు. సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రులు తాము చేసిన కార్యకలాపాలు, చేయబోయే పనుల గురించి ప్రస్తావిస్తారు. మోదీ ప్రసంగం మొత్తం వచ్చే ఏడాది మే లోగా జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రజలు తన కుటుంబం అని చెప్పడమే కాక ఆశీర్వదించాలని కోరారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఎర్రకోట మీంచి చేసిన ప్రసంగాలన్నీ మునుపటి ప్రధానుల ప్రసంగాలతో పోలిస్తే భిన్నమైనవే. కాలక్రమంలో సహజంగా జరిగే అభివృద్ధిని కూడా మోదీ తన ఖాతాలో వేసుకోగలరు. జరిగిన మంచంతా తనవల్లేనని రాట్నం చుట్టూ తిరిగే ఈగలాగా భావించగలరు. ఆయన ప్రసంగంలో వాస్తవాలను విస్మరించారు. గతంలో చేసిన వాగ్దానాలు అమలు కాని కఠిన సత్యాలను అంగీకరించనే లేదు. ప్రజల అసలు సమస్యలను పక్కకు నెట్టేశారు. తనను ఆశీర్వదించమని మోదీ కోరడాన్ని తప్పుబట్టలేం. కానీ ఎందుకు ఆశీర్వదించాలో కచ్చితంగా ఆలోచించాల్సిందే. విద్య, ఆరోగ్య రంగాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించినందుకు ఆయనను ఆశీర్వదించాలా? వ్యవసాయ ఉత్పాదన మీద శ్రద్ధ పెట్టకుండా రైతులకు రోజుకు రూ. 70 చొప్పున అందించి మీ దారి మీరు చూసుకోండి అని వదిలేసినందుకు ఆశీర్వదించాలా? వచ్చే సారి మళ్లీ ఇదే ఎర్రకోట ప్రసంగం సందర్భంగా కలుద్దాం అని ఆయన అమిత ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ ప్రజలను పరివారజనులని ప్రస్తావించడం, వెయ్యేళ్ల తరవాత భారత్ ఎలా ఉండబోతోందో కలలు కంటున్నాని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే ఆయన కలల్లోనే జీవిస్తారు. 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని, అవినీతిని నిర్మూలించడానికే తన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, వంశపారంపర్య లేదా కుటుంబ పాలనను అంతం చేసే దాకా విశ్రమించబోనని మోదీ అదే పనిగా దండోరా వేస్తుంటారు. తన హయాంలో అవినీతి ప్రస్తావన వచ్చినప్పుడల్లా దేశభద్రత సాకు చూపి తప్పించుకుంటారు. ఇటీవలే దిల్లీని గుర్గావ్‌తో కలిపే ద్వారక ఎక్స్ ప్రెస్ వే నిర్మాణ వ్యయం గతంలో ప్రతి కిలోమీటరుకు రూ. 18.20 కోట్లు ఉంటుందని అంచనా వేస్తే ఇప్పుడు దాన్ని అమాంతం ప్రతి కిలోమీటరుకు రూ. 250.77 కోట్లకు పెంచారు. ఇది మోదీ దృష్టిలో అవినీతి కానే కాదని నమ్మమంటారు. అవినీతి, బంధుప్రీతి, మైనార్టీలను సంతృప్తి పరచడం అనే మూడు దుష్టమైనవని మోదీ గొంతెత్తి చెప్పారు. నీతిమంతంగా, దాపరికం లేకుండా ఉండడం, నిష్పక్షపాతంగా ఉండడం అందరి బాధ్యత అని సుద్దులు చెప్పారు. మోదీ పాలనలోనే ఈ దుర్లక్షణాలన్నీ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. మేక్ ఇన్ ఇండియా అన్న అందమైన నినాదం వినిపించిన మోదీ పాలనలోనే వస్తూత్పత్తి సామర్థ్యం తగ్గింది. ఇతర దేశాలనుంచి విడిభాగాలు తీసుకొచ్చి వాటిని కూర్చి వస్తువులు తయారు చేయడం తప్ప వస్తూత్పత్తి పెరిగిన దాఖలాలే లేవు. అక్షరాస్యతా శాతం క్రమంగా పెరగడంలో మోదీ ప్రమేయం నిమిత్త మాత్రంగా కూడా లేదు. అవినీతి గురించి గొంతు చించుకునే ప్రధాని మోదీ ఇదివరకు మేఘాలయ ప్రభుత్వమంత అవినీతికరమైంది ఎక్కడా లేదన్నారు. కానీ మళ్లీ అదే ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామి అయింది. ఏ రూపంలో మోదీ అవినీతికి వ్యతిరేకంగా పోరాడగలరని నమ్మాలి?

మోదీ తన ప్రసంగంలో జనాభా స్వరూపం, ప్రజాస్వామ్యం, వైవిధ్యం అన్న మూడు మహత్తరమైన మాటలను సునాయాసంగా దొర్లించారు. అనేక చోట్ల జనాభా స్వరూపాన్ని మారుస్తున్నది మోదీ సర్కారే అని చెప్పడానికి ప్రస్తుతం మణిపూర్‌లో కొనసాగుతున్న మారణకాండకన్నా మించింది ఏమైనా ఉంటుందా? ప్రజాస్వామ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి ఏ అవకాశాన్ని వదలని మోదీ నోటి నుంచి ఆ మాట వెలువడడం వెగటుగా ఉంటుంది. వైవిధ్యాన్ని అంతం చేయడానికి మోదీ హయాంలో జరిగిన ప్రయత్నాలను ప్రస్తావించాలంటే అదే చేంతాడంత అవుతుంది. మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాలలో నిర్దిష్టమైన పద్ధతి ఉంటుంది. సాధారణంగా ఎర్రకోట మీంచి ఏ ప్రధానమంత్రి ప్రసంగించినా తమ ప్రభుత్వం సాధించిన విజయాలను తెలియజేయడం మరో సంవత్సరకాలంలో అమలు చేసే పథకాలను ప్రస్తావించడం రివాజు. మంచంతా తన వంచలోనే ఉంటుందని ఆయన దృఢ విశ్వాసం. వాస్తవాలను వక్రీకరించడం, అమలు కాని వాగ్దానాల ఊసెత్తకపోవడం మోదీ విశిష్ట శైలి. ప్రజల సమస్యలను ఆయన వాటంగా పక్కకు తోసేస్తారు. ఆయన ప్రసంగాల్లో ఎప్పుడూ సుందర స్వప్నాలు ఆవిష్కరిస్తారు. కానీ అవి అమలు కావడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళిక జాడే ఉండదు. వచ్చే అయిదేళ్ల కాలంలో మన దేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, దీనికి నాది పూచీ అని మోదీ అన్నారు. 2028కల్లా భారత్ మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని 2013లోనే, అంటే మోదీ అధికారంలోకి రాకముందే నివేదికలు వచ్చాయి. దీన్ని మోదీ పట్టించుకోరు. ఇదేదో తాను ఆవిష్కరించిన స్వప్నంలా చెలామణి చేస్తారు. ప్రస్తుతం మనం అయిదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని మోదీ గుండెలు బాదుకుని మరీ చెప్తారు. దీనికి కారణం మన ఎదుగుదల కాదు. బ్రిటన్ వెనకబడి పోవడం. 2075 కల్లా భారత్ రెండవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందని గోల్డ్మన్ సాక్స్ సంస్థ విశ్లేషణలో తేలింది. తాను అధికారంలోకి రాకముందు భారత ఆర్థిక వ్యవస్థ ప్రమాదం అంచున ఉందని చెప్పింది మోదీనే. కానీ 2004 నుంచి 2014 మధ్య మన ఆర్థిక వ్యవస్థ సగటున 7.8 శాతం అభివృద్ధి సాధించింది. మోదీ అధికారం చేపట్టిన తరవాత మన పురోగతి సగటున కేవలం 5.7 శాతమే. ఈ గణాంకాలు సామాన్యులు గ్రహించకపోయినా ఇవి కఠిన వాస్తవాలు. సామాన్యుల బలహీనతను ఆధారంగానే మోదీ కలలు అమ్ముతారు. కాదు వాస్తవం ఇది అంటే హార్వర్డ్ పండితులు అని ఎద్దేవా చేస్తారు. అది ఆయన నైజం. పనిగట్టుకుని అలవర్చుకున్న శైలి. 2014 నుంచి యువతలో నిరుద్యోగం 22 శాతం ఉంది. ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్నందువల్ల ఉపాధి అవకాశాలు కుంచించుకు పోయాయి. ఉద్యోగాల కోసం వెయ్యి మంది దరఖాస్తు చేసుకుంటే అవి దక్కుతున్నది కేవలం ముగ్గురికే అన్న సత్యం మోదీ చెవికెక్కదు. మొత్తం మీద మంగళవారం ప్రసంగాన్ని మోదీ కలలు అమ్మడానికే వినియోగించుకున్నారు.

కాలుష్య రహిత ఇంధనం సరే ఆహార భద్రత ఏది ?

ధాన్యం ఉత్పత్తి నుండి వచ్చే ఇథనాల్ వ్యవసాయ వ్యర్థాలను ఇంధనంగా మార్చడానికి ఉపయోగిస్తారు. ఈ ఇంధనాన్ని గ్యాసోలిన్ లేదా డీజిల్‌తో నడిచే ఆటోమొబైల్స్, ట్రక్కులు, ఇతర వాహనాల్లో వినియోగిస్తారు. భారతదేశం 2021-22లో 212.2 మిలియన్ టన్నుల ముడిచమురును దిగుమతి చేసుకోవడానికి దాదాపు 119.2 బిలియన్లను వెచ్చించి, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ముడిచమురు దిగుమతిదారుగా ఉంది. కానీ ముడిచమురుపై ఆధారపడటం అనేది ఆర్థిక, పర్యావరణం రెండింటికీ ఖర్చుతో కూడుకున్నది. దీర్ఘకాలంగా ఇథనాల్ ఆచరణీయమైన జీవ ఇంధనంగా నెలకొంది. ఇథనాల్ ఇప్పటికే ముడి చమురు ఆధారిత ఇంధనాలైన డీజిల్, పెట్రోల్ వంటి వాటిల్లో ఇథనాల్ మిశ్రమంగా ఉంది. ప్రస్తుతం, పెట్రోల్ ఆధారిత ఉత్పత్తుల కోసం ఈ ఇథనాల్ మిశ్రమం 10శాతం వరకు ఉంటుంది. 2025 నాటికి ఇథనాల్ మిశ్రమాన్ని పెట్రోల్ ఆధారిత ఉత్పత్తులకు 20శాతం, డీజిల్ ఆధారిత ఇంధనాలకు 5శాతం పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం సాధిస్తే మెరుగైన ఇథనాల్ మిశ్రమం ప్రతి సంవత్సరం 30,000కోట్ల రూపాయల విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేస్తుందని అంచనా. గాలి నాణ్యత ఇంధన భద్రతను మెరుగుపరుస్తుందని, కాలుష్యాన్ని తగ్గిస్తుందని, ఇది రైతు ఆదాయానికి గణనీయమైన ప్రోత్సాహాన్ని అందించి వ్యర్థ వ్యవసాయ ఉత్పత్తులను తగ్గిస్తుందని ప్రభుత్వం భావించినా వాస్తవానికి కథ భిన్నంగా ఉంది. ఇథనాల్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రం ఆహార వ్యర్థాలు, పంట అవశేషాలను ఉపయోగించాలి. 2025 నాటికి ఇంధనంలో 20శాతం ఇథనాల్‌ను కలపాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించిన కేంద్రం ముఖ్యంగా ఆహారధాన్యాల వినియోగానికి యత్నిస్తున్నది. డిసెంబర్ 2022 జూన్ 2023 మధ్య ఇథనాల్ తయారీదారులకు 13 లక్షల టన్నుల బియ్యాన్ని సరఫరా చేయడంతో ఆ నిల్వలను కాపాడుకోవడానికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) జూలై నుండి తాజా సరఫరాలను నిలిపివేసింది. 135లక్షల టన్నుల బఫర్ నిల్వల ప్రమాణానికి వ్యతిరేకంగా 2023 ఆగస్టులో ఎఫ్‌సీఐ వద్ద 243 లక్షల టన్నుల బియ్యం నిల్వలు ఉన్నప్పటికీ, ఆహార భద్రతా పథకాల కింద బియ్యం వార్షిక పంపిణీ ఇప్పుడు 350 లక్షల టన్నులుగా ఉంది. ఖరీఫ్ పంట సాధారణంగా ఇన్వెంటరీలను పెంచుతుంది. ఈ సంవత్సరం, నైరుతి రుతుపవనాలు అస్థిరంగా ఉండటంవల్ల వరి ఉత్పత్తిపై సందేహాలు, దాని బఫర్‌లను తిరిగి నింపే ఎఫ్‌సీఐ సామర్థ్యంపై సందేహాలు ఉన్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థకు సరిపడా నిల్వలు ఉంచుకోవాల్సిన అవసరాన్ని పేర్కొంటూ ఈ జూన్‌లో ఎఫ్‌సిఐ రాష్ట్ర ప్రభుత్వాలకు బియ్యం అమ్మకాలను నిలిపివేసినందున, ఇథనాల్ సరఫరాను కూడా నిలిపివేయడం న్యాయంగా కనిపిస్తోంది. ఇథనాల్ డిస్టిలరీలకు మొక్కజొన్నను ఉపయోగించవచ్చా అని కేంద్రం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ నిజంగా కావలసింది ధాన్యం-ఆధారిత ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్‌పై పూర్తిగా పునరాలోచించడం. 2021లో నీతి ఆయోగ్ నిపుణుల కమిటీ నివేదికలో ధాన్యం-ఆధారిత ఇథనాల్ మిశ్రమం ఆలోచనను నిర్దేశించారు. 20శాతం పెట్రోలు కలపడం లక్ష్యాన్ని చేరుకోవడానికి, భారతదేశానికి 1,016 కోట్ల లీటర్ల ఇథనాల్ అవసరమవుతుందని లెక్కించింది. చక్కెర పరిశ్రమ సంవత్సరానికి 684 కోట్ల లీటర్లు మాత్రమే ఉత్పత్తి చేయగలదు. దెబ్బతిన్న ఆహారధాన్యాలు, పంట అవశేషాలు, మొక్కజొన్న, ఎఫ్‌సిఐతో మిగులు బియ్యం వంటి ప్రత్యామ్నాయాలను ఉపయోగించి, అన్నింటికీ 165 లక్షల టన్నుల ధాన్యాలు అవసరమని సూచించారు. దెబ్బతిన్న ధాన్యం లభ్యత కేవలం 40 లక్షల టన్నులకు చేరుకోవడంతో, ఎఫ్‌సిఐ వద్ద ఉన్న 'మిగులు' బియ్యం నిల్వల మళ్లింపుపై అంచనా ఎక్కువగా ఉంది. కానీ ఎఫ్‌సీఐ సంవత్సరానికి 309 లక్షల టన్నుల మిగులు బియ్యం స్టాక్‌ను తీసుకువెళు తుందనే ఊహ, వర్షాకాలం కొనుగోళ్లను తగ్గించడం లేదా సంక్షేమ పథకాలకు అధిక సరఫరాలు వంటి ఆకస్మిక పరిస్థితులలో ఏంచేయాలని ప్రభుత్వం నిర్ణయించాలి. ఇథనాల్‌కు మిగులు బియ్యం మార్గం ప్రైవేట్ డిస్టిలరీలకు డబుల్-సైడెడ్ స్టేట్ సబ్సిడీ ద్వారా కూడా ఆసరాగా ఉంది. ఈ కార్యక్రమానికి మద్దతుగా, ఎఫ్‌సిఐ ఇథనాల్ తయారీదారులకు కిలో రూ.20కి తగ్గింపు ధరకు బియ్యాన్ని సరఫరా చేస్తుంది, దాని బహిరంగ మార్కెట్ విక్రయధర (రూ.30/కిలో) బియ్యంసేకరణ, నిల్వధర (రూ.39/కిలో) రెండింటికీ నష్టాన్ని కలిగిస్తుంది.) జనాభా స్థాయిలో పోషకాహారలోపం పేదరికం కారణంగా, ఇథనాల్ మిళితం లక్ష్యాలకు అనుగుణంగా ఇటువంటి విధాన వైకల్యాలకు నైతిక లేదా ఆర్థిక సమర్థనను కనుగొనడం కష్టం. మొక్కజొన్న లేదా మరేదైనా ఆహారపంటకు పివోటింగ్ కాకుండా, ఇథనాల్‌ఉత్పత్తికి ఆహారవ్యర్థాలు, పంట అవశేషాలను ఉపయోగించే 2జి మార్గాన్ని పెంచడానికి కేంద్రం చూడాలి. అటువంటి మూలాధారాల నుండి ఫీడ్‌స్టాక్ పరిమితంగా ఉన్నట్లయితే, బ్లెండింగ్ లక్ష్యాలను తగ్గించాలి. అస్థిరమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు తమ ఆహార సామాగ్రిని కాపాడుకోవడానికి భారతదేశం సహా ఆకుపచ్చ ఇంధనంకంటే ఆహారభద్రతకు ప్రాధాన్యతనివ్వాలి.

డా. యం.సురేష్ బాబు, ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

సమస్యలపై గళమెత్తనున్న సీపీఐ బస్సుయాత్ర

డాక్టర్. సీఎన్. క్షేత్రపాల్ రెడ్డి

'రాష్ట్రాన్ని రక్షించుకుందాం- దేశాన్ని కాపాడుకుందాం' అనేది భారత కమ్యూనిస్టు పార్టీ నినాదం. ఈ నినాదం కేంద్రంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక పాలనా విధానాలను ప్రజల మధ్య ఎండగట్టాలని ఏపీ రాష్ట్ర సమితి నిర్ణయిచింది. దీంతో పాటు రాష్ట్రాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యల్ని వివరిస్తూ ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 8 వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ రంగంలోని నవరత్న సంస్థలలో కీలకమైన, నేడు కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టి విశాఖలోని ఉక్కు కర్మాగారం ప్రధాన ద్వారం నుంచే ఈ బస్సు యాత్ర ప్రారంభం కానుంది. 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' నినాదంతో 36 మంది విద్యార్థుల బలిదానాలతో సాధించుకున్న ఈ సంస్థను నష్టాలొస్తున్నాయనే సాకుతో మోదీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడాన్ని కార్మికవర్గంతో కలసి సీపీఐ తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఈ కుట్రలను తిప్పికొట్టడం కోసం ప్రజలను చైతన్యం చేసేందుకు బస్సుయాత్ర జరుగుతుంది. ఏటా నాణ్యమైన 73 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో దేశంలోని అన్ని ఉక్కు కర్మాగారాలకన్నా ఉన్నతమైన కార్మాగారాన్ని కాపాడుకోవడం కోసం దిల్లీ సరిహద్దులను చుట్టుముట్టి సాగు చట్టాలను రద్దు చేయించిన అన్నదాతల పోరు ఆదర్శంగా తీసుకుని మరో మహత్తర పోరుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర విభజన పూర్తై తొమ్మిదేళ్లు గడచినా పార్లమెంటు వేదికగా లభించిన ప్రత్యేక హోదా హామీ అమలవలేదు.హోదాను గంగలో కలిపిన కేంద్ర ప్రభుత్వం అత్యంత వెనుకబడిన ఉత్తరాంధ్రకు కూడా తీవ్రమైన అన్యాయమే చేసింది. ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు అటకెక్కాయి. ఈ ప్రాంతంలోని ప్రాజక్టులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని స్థితి నెలకొంది. రాష్ట్రం విడిపోయినా ఇప్పటికి అదనంగా ఒక్క చుక్క నీరు కూడా లభ్యం కాలేదు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు హామీగానే మిగిలింది. బుందేల్‌ఖండ్ తరహాలో ఉత్తరాంధ్రకు రూ.8 వేల కోట్ల రూపాయల మేర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు రావాల్సి ఉన్నా అవి దక్కలేదు. విశాఖ మెట్రో రైల్ ఊసే మరిచారు. గిరిజన యూనివర్సిటీ స్థల సేకరణ వివాదంలో పడింది. ఐఐఎం నేటికీ తాత్కాలిక భవనాల నుండే నడుస్తోంది. విషపూరిత రసాయిన, ఫార్మా కర్మాగారాలన్నిటినీ ఉత్తరాంధ్రపైనే రుద్దుతున్నాయి. ప్రజల జీవితాలను పణంగా పెట్టి కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ఉత్తరాంధ్ర నెత్తిన రుద్దుతోంది. ఉత్తరాంధ్రలో 8 లక్షల ఎకరాలకు సాగు నీరు, 1200 గ్రామాలకు తాగు నీరందించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజక్టు సహా వంశధార, నాగావళి నదులపై ప్రాజక్టు, శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టీ మండలంలో మహేంద్ర తనయ నదిపై నిర్మించతలపెట్టిన ఆఫ్ షోర్ ప్రాజక్టు పనుల్లో పురోగతీ లేదు. పార్వతీపురం జిల్లాలోని జంఝావతి ప్రాజక్టు నేటికీ పూర్తికాలేదు. ఉత్తరాంధ్రకు స్వయం ప్రతిపత్తితో కూడిన ప్రాంతీయ అభివృద్ధి

మండలి ఏర్పాటు డిమాండును ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. అభివృద్ధి పేరుతో తెచ్చిన పైడిభీమవరం ఇండస్ట్రియల్ పార్క్, దివిస్, పరవాడ ఫార్మా పార్క్, బ్రాండెక్స్, హెటిరో ఎస్ఇజెడ్, అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లలో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా పాలకులకు పట్టడం లేదనే అంశాలన్నీ సీపీఐ బస్సు యాత్రలో చర్చనియాంశం కానున్నాయి. ఉత్తరాంధ్రలోని పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజక్టులు పూర్తి, ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ద్వారా 30 వేల కోట్ల నిధులు, విశాఖ నగరాన్ని ఐటీ హబ్‌గా మార్చడం తదితర డిమాండ్లను బస్సు యాత్రలో సీపీఐ ఎలుగెత్తనుంది.ఏపీకి సముద్రతీరం ఒక వరం. 970 కిలోమీటర్ల మేర విస్తరించిన తూర్పు తీరప్రాంతంలో ప్రభుత్వాలు కోస్టల్ కారిడార్ ప్రాజెక్టును రూపొందించాయి. ఇందులో షిప్పింగ్, ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచడం అనే మిషతో పూర్తిగా పర్యావరణ విధ్వంసం జరుగుతోంది. గడిచిన 20 ఏళ్లగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఏపీ సెజ్ అచ్యుతాపురం, జెఎన్‌పీసీ పరవాడ, ఫార్మా పరవాడ, నక్కపల్లి క్లస్టర్, కోనా ల్యాండ్స్, తమ్మవరం కాకినాడ సెజ్ ల కోసం సుమారు 23,593 వేల ఎరకాలు ప్రజల నుంచి సేకరించారు. ఇందులో 19,436 వేల ఎకరాల్లో బ్లాకుల్ని ఏర్పాటు చేసినా వినియోగించుకుంది కేవలం 4,707 ఎకరాల్ని మాత్రమే. ఇప్పటికీ 14,729 వేల ఎకరాలు ఖాళీగానే ఉన్నాయి. ఈ భూములు ఇచ్చిన రైతులతో పాటు సుమారు రెండు కోట్ల మంది తమ జీవనాధారాన్ని కోల్పోయారు. ఏర్పాటైన వాటిలోనూ రసాయిన పరిశ్రమలే ఎక్కువ. ఆ పరిశ్రమల నుంచి వచ్చే విషపూరిత వ్యర్థాలు నేరుగా సముద్రంలోకి చేరుతుండడంతో సముద్ర జలాలు పూర్తిగా విషపూరితమై మత్స్య సంపద నాశనమవుతోంది. భూగర్భ జలాలు కలుషితమై సిరులు పండే భూముల్లో విషం చిందుతోంది. ఈ నేపథ్యంలో కోస్టల్ కారిడార్‌ను సీపీఐ వ్యతిరేకిస్తుంది. తూర్పు తీర ప్రాంతం అభివృద్ధిపై పాలకులకు నిజమైన చిత్తశుద్ధి ఉంటే కోస్టల్ కారిడార్‌లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై పర్యావరణ, పౌర, ప్రజాసంఘాలకు చెందిన వివిధ రంగాల నిపుణులతో చర్చించాల్సి ఉంటుంది. పర్యావరణాన్ని నాశనం చేస్తున్న కోస్టల్ కారిడార్ పనులను పున:సమీక్షించి పర్యావరణానికి నష్టం వాటిల్లని రీతిలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలనే చర్చను పెట్టనుంది.

రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనుల జనాభా ఎక్కువే. ప్రధానంగా ఉత్తరాంధ్రలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్లతో పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఆవిర్భవించింది. ఉత్తరాంధ్రలోని చాలా మండలాలు పూర్తిగా అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. పాడేరు డివిజన్, తూర్పుగోదావరి జిల్లాలోని రంపచోడవరం డివిజన్ పూర్తిగా గిరిజన ప్రాంతాలే. గిరిజనులుండే ప్రాంతాల్లో సాగు, తాగునీరు, రహదారులు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. గిరిజనాభివృద్ధి మాటలకే పరిమితమవుతోంది. కనీసం వైద్య సదుపాయాలు లేక నిత్యం డోలీల్లో రోగులను తరలించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గిరిజన హక్కులు, చట్టాలు పకడ్బందీగా అమలవడం లేదు. అటవీ సంరక్షణ చర్యలు మృగ్యం అవుతున్నాయి. అభివృద్ధి ముసుగులో ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా హైడ్రో పవర్ ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులిచ్చేసింది. పర్యాటకం పేరుతో గిరిజన ప్రాంతాల్లో చేస్తోన్న పనుల కారణంగా కాలుష్యం పెరుగుతున్నా నివారణ చర్యల్లేవు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురయ్యే గిరిజన ప్రాంతాల్లోని నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వడంలేదు. పునరావాసం కల్పించలేదు. ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వమే పక్కా ఇల్లు నిర్మించాలి. పోడు వ్యవసాయం చేసుకుంటున్న ప్రతి గిరిజన రైతుకు ఆ భూములపై హక్కులు కల్పించాలి. సాగుభూములు లేని గిరిజనులకు ప్రతి కుటుంబానికి 10 ఎకరాల సాగుభూమిని కేటాయించాలి. గిరిజనుల ఆవాసాలైన ప్రాంతాల్లో బాక్సైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వకుండా పటిష్టమైన చట్టం తీసుకురావాలి. హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులను తక్షణమే నిలిపివేయాలి. జీవో నెంబరు 3 కి చట్టబద్ధత కల్పించి నూరు శాతం ఉద్యోగాల్ని గిరిజనులకే కేటాయించాలి. ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను గిరిజన యువతీ, యువకులు కల్పించాలి. గిరిజనులకు నిత్యావసరాలను అందించే గిరిజనకార్పొరేషన్‌ను ప్రైవేటీకరించ కుండా ప్రభుత్వరంగంలోనే నిర్వహించాలి. అటవీ హక్కుల చట్టాన్ని, 1-70 చట్టాన్ని పటిష్టంగా అమలుచేస్తూ స్థానికులు తప్ప ఇతర వ్యక్తులు గిరిజన ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయకుండా అడ్డుకట్ట వేయడం, పీ.సా (పిఈఎస్ఏ) చట్టాన్ని పటిష్టంగా అమలు తదితర అంశాలు సీపీఐ బస్సు యాత్ర అజెండాలో కీలకం కానున్నాయి.

సెల్: 9059837847

మణిపూర్ మానవత్వహననంపై ముర్ము మౌనమే!

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

మానవవాదులు కురుచ అకృత్యాలతో అఘాతానికి, దిగ్భ్రాంతికి, విభ్రాంతికి, భయోత్పాతానికి లోన వుతారు. కొందరి మానసిక ప్రవృత్తిని ఇవే దుష్కృత్యాలు సకారణ సవివరణలతో వివేక పరుస్తాయి. అభిజాత్య, అమానవీయ భావ జాలంతో ఎదిగినవారు సహజ నామాలకు తగ్గట్లు దుర్యోధన, దుశ్శాసన దుశ్చర్యలను సమర్థిస్తారు. రాజకీయాకరిస్తారు. 21 ప్రతిపక్షపార్టీల ఎంపీలు మణిపూర్ మారణకాండను, 'అ'సహాయక శిబిరాలను జులై 29,30 తేదీలలో పరిశీలించారు. బాధితుల బాధలతో, ఆదివాసి ఆడతనాన్ని ఆయుధంగా చేసుకున్న మోదీ బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల విద్వేష రాజకీయాలతో వారి గుండెలు మండాయి. 30వ తేదీన ఎంపీలు వినతిపత్రంతో మణిపూర్ మహిళా గవర్నర్ అనుసూయా ఉకీ విధులను గుర్తుచేశారు. రాజకీయాల్లోకి రాకముందు ఈ ఆదివాసి మహిళ న్యాయవాది, అధ్యాపకురాలు, వ్యవసాయ సామాజిక కార్యకర్త. 38 ఏళ్ల క్రితమే మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ స్త్రీ, శిశు అభివృద్ధి శాఖమంత్రి. 25ఏళ్ల క్రితం స్వీయ ప్రగతికోసం బీజేపీలో చేరారు. 2019 లో చత్తీస్‌గఢ్ గవర్నర్ కాకముందు మధ్యప్రదేశ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ అధ్యక్షురాలిగా, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా, ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. ఆదివాసి ఓటర్లను దువ్వడానికే మోదీ ఈమెకు ఇన్ని పదవులు కట్టబెట్టారు. రాజ్యాంగ అధికరణ 356ప్రకారం రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలను గవర్నర్ రాష్ట్రపతికి నివేదించాలి. ఈ గవర్నర్ ఈ పని చేయలేదు. మణిపూర్ మానవహననాన్ని చూసివచ్చిన తర్వాత ప్రతిపక్ష కూటమి ఆగస్టు2 న రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. మణిపూర్ మానవత్వహత్యలో ఆమెను కల్పించుకొమ్మని, పార్లమెంటులో మాట్లాడి ఆ అగ్గిని ఆపమని ప్రధానికి సూచించమని వేడుకున్నారు. మహిళత్వహత్య సత్యాలను ప్రస్తావించడానికి మణిపూర్ నుండి ఇద్దరు మహిళా ప్రతినిధులను రాజ్యసభకు నియమించమని కోరారు.

ప్రధాని కార్యాలయానికి 100కి.మీ.దూరంలో హరియాణాలో జరుగుతున్న మతకల్లోలాలను ప్రభుత్వం పట్టించుకోలేదనీ చెప్పారు. వినతిపత్రం ఇచ్చారు. ముర్ము ఆదివాసి. సంఘ్ సభ్యురాలు. మానవత్వ ఆధ్యాత్మిక స్ఫూర్తిని మేల్కొలిపే స్త్రీలపై నకారాత్మకత, చెడుల నివారణకు నడుంబిగించిన బ్రహ్మపుత్రికల సమాజం బ్రహ్మకుమారి ఆధ్యాత్మిక ఉద్యమ ఆచరణురాలు. అరబిందో సమగ్రవిద్య పరిశోధన పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సేవలందించారు. స్త్రీ సమానత్వానికి, దళితుల గౌరవానికి పాటుబడ్డ నెహ్రూ, గాంధీ, అంబేద్కర్‌లను మెచ్చుకున్న మేలు మహిళ. ఒడిశా మత్స్య పశువనరుల అభివృద్ధిశాఖ మంత్రిగా, ఝార్ఖండ్ గవర్నర్‌గా పనిచేశారు. 2016-17లో బీజేపీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ ఆదివాసుల భూములను వాణిజ్యానికి వాడుకోడానికి, అద్దె పేరుతో ఆక్రమించుకోడానికి ప్రభుత్వానికి హక్కులు కల్పిస్తూ చట్టంచేశారు. దీనికి వ్యతిరేకంగా ఝార్ఖండ్ ఆదివాసులు పాథలగడ్ ఉద్యమంపేరుతో పెద్దఎత్తున పోరాడారు. గిరిజన తెగలపై పోలీసులు అక్రమంగా, దుర్మార్గంగా ప్రవర్తించారు. అందులో బీజేపీ నిర్బంధంలో జైలులో మరణించిన స్టాన్ స్వామీ ఉన్నారు. రాష్ట్రపతి ముర్ము ప్రభుత్వపక్షం వహించారు. ఆ చట్టాన్ని వ్యతిరేకించిన 192 వినతి పత్రాలను చెత్తబుట్టలో పడేశారు. పాథలగడ్ ఉద్యమాన్ని నీరుగార్చారు. జాతీయ ఎస్.సి., ఎస్.టి. కమిషన్‌ను దుర్లక్ష్యంచేసి రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన బీజేపీ ప్రభుత్వాన్ని పల్లెత్తుమాట అనకుండా గిరిజనులనే రాజ్యాంగాన్ని గౌరవించమని కోరారు. మతస్వేచ్ఛ పేరుతో బీజేపీ ప్రభుత్వంచేసిన మతమార్పిడి వ్యతిరేక బిల్లును ముర్ము ఆమోదించారు. రాష్ట్రపతి ప్రారంభించవలసిన కొత్త పార్లమెంటు భవనాన్ని మోదీ ప్రారంభించారు. ఆమెను ఆహ్వానించలేదు. అయినా ముర్ము మోదీని సమర్థించారు. "ప్రధాని పార్లమెంటుకు ప్రతీక. ఆయన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించడంతో గర్వపడుతున్నాను. ప్రగాఢ సంతృప్తిని పొందాను" అని దాసత్వం ప్రదర్శించారు. రాజ్యాంగ అధికరణ 52 ప్రకారం రాష్ట్రపతి దేశ ప్రథమ పౌరురాలే గాక దేశ సంఘీభావ, సమైక్యత, సమగ్రతల చిహ్నం. సమాఖ్య కార్యనిర్వాహకవర్గ అధిపతి. అత్యవసర అంశాలపై, ప్రత్యేకించి మానవత్వ మరణంపై ప్రధానిని హెచ్చరించగల అధికారి. అనుకోని సమస్యలలో పౌరుల ప్రాథమిక హక్కుల హామీకి రాష్ట్రపతికి నిర్దిష్ట పాత్ర, అధికారాలు, ప్రత్యేక రాజ్యాంగ నియమాలు ఉన్నాయి. అధికరణ 60ప్రకారం రాజ్యాంగం, చట్టాల నిర్ధారణ, సంరక్షణ రాష్ట్రపతి రాజ్యాంగ విధి. అధికరణ 78 ప్రకారం పాలనా వ్యవహారాల సమాచారాన్ని గురించి ప్రధానిని అడిగే హక్కు ఉంది. నేటి మణిపూర్ సంఘటన ఇలాంటిదే. మంత్రివర్గాన్ని

ఆగస్టు 2 న రాష్ట్రపతితో సమావేశంలో ప్రతిపక్ష కూటమి ఇండియా నాయకులు

హెచ్చరించడం, ప్రోత్సహించడం రాష్ట్రపతి ధృవీకరణ సంప్రదాయ హక్కు. మణిపూర్ సర్వాంగమృత సందర్భంలోనూ ముర్ము మౌనించారు. అపరిమిత ఆదివాసి అనుకూల అర్హతలు కలిగిన ప్రథమ మహిళ ముర్ము మణిపూర్ మానవత్వ సమాధిని గురించి స్పందించలేదు. మణిపూర్ ప్రథమ మహిళ గవర్నర్ అనుసూయ ఉకి కిమ్మనలేదు. మోదీ మీద గాలివీచినా వాయుదేవున్ని తిట్టే సంఘ్ శ్రేష్ఠ స్త్రీలు ఎవరూ మణిపూర్ మారణకాండను, మహిళా మాన ప్రాణ హననాలను ఖండించలేదు. ప్రస్తావించలేదు. వీరంతా మోదీ దయతో పదవులు పొందామని, ఆయన్ను ఎట్టిపరిస్థితుల్లోనూ వ్యతిరేకించకూడదని కంకణం కట్టుకున్న వైదికవాద పురుష పక్షపాత స్త్రీలు. మణిపూర్ మౌనం మోదీకి మొదటిది కాదు. సంఘ్ ప్రథమ ప్రయోగశాల గుజరాత్‌లో ముస్లింల మానప్రాణాల, మానవత్వ హత్యలపై మౌనంవహించారు. హింస కొనసాగింపుకు పోలీసులనూ మౌనంగా ఉండమన్నారు. ఆ మౌనం రాజధర్మ విరుద్ధమన్న ప్రధాని వాజ్‌పేయికి అబద్ధాలు చెప్పారు. బీజేపీ ద్వితీయ నాయకులతో వాజ్‌పేయిని సహజ విరోధసంఘ్ ప్రక్రియలో బంధించారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఆదివాసుల హత్యల్లో, భూ ఆక్రమణల్లో, సహజ వనరుల దోపిడిలో మోదీ మౌన యోగం చేశారు. మనం స్వచ్ఛ సంప్రదాయ ప్రజాస్వామ్య, రాజ్యాంగ నియమాల ఊహలలో ఉన్నాం. మతమదోన్మాదుల నుండీ అవే విలువలను ఆశిస్తున్నాం. సాధారణంగా దేశ రాష్ట్రపతులు, ప్రధానులు రాజ్యాంగ విలువలనే పాటిస్తారు. వ్యక్తిగత ఆచారాలను ప్రక్కనపెడతారు. కాని మోదీ తత్వంవేరు. ఆయన వైదికవాద మత ప్రచారకుడే కాని రాజ్యాంగ ప్రధానిగా ఎదగలేదు. ఎదగరు కూడా. అందుకే ఆయన ఏ సందర్భంలో మాట్లాడినా శతాబ్దాలనాటి ముస్లిం పాలనా బానిసత్వం, బీజేపీ అవినీతితప్ప ఇతరుల అవినీతి, వాజపేయి పాలనతో సహా గత 70ఏళ్ల అభివృద్ధి రాహిత్యాన్ని గురించే పదాల పొందికతో, ప్రాసలతో, శబ్దాలంకారాలతో, వాక్చాతుర్యంతో ధమాయిస్తారు. మొన్న తన మణిపూర్ ఆశ్రితపక్షపాత, ఎన్నికల లబ్ధి నిర్లజ్జను 140కోట్ల భారతీయులకు పంచారు. బీజేపీయేతర ప్రభుత్వాల పాపాలను ఉటంకించి మణిపూర్ వైదికవాద వైష్ణవ మెయితీయ మతోన్మాదాన్ని పలుచబరిచారు. మణిపూర్ మానవత్వ మృత ప్రహసన నిరోధక బాధ్యత తనది కాదని పరోక్షంగా ప్రస్తావించి, దాన్ని ముఖ్యమంత్రులందరికీ పంచారు. అవిశ్వాస తీర్మాన చర్చలో పాల్గొనకుండా స్పందనలో కూడా మూడు గంటల ప్రతిపక్ష తిట్ల దండకంలో మణిపూర్ గురించి మూడేనిమిషాలు మాట్లాడారు. అమిత్ మణిపూర్ వెళ్ళి అద్భుతాలు చేశారన్నారు. మణిపూర్ సమస్య పరిష్కార బాధ్యతను ప్రతిపక్షాల మీదికి నెట్టారు. ప్రధానిగా మారని మతోన్మాది నుండి ఇంత కంటే ఏమి ఆశించగలం?

సర్వోన్నత న్యాయస్థాన మానవవాద న్యాయపీఠం ముగ్గురు పూర్వ స్త్రీ న్యాయమూర్తులతో నిఘా, ఉపశమన, నివారణ, పరిహార, పునరావాస కార్యక్రమాల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటుచేసింది. మోదీ తన జవాబులో కోర్టుల్లో ఏం జరుగుతోందో తెలుసునని నేటి సుప్రీంకోర్టు న్యాయ విచక్షణ తీరునూ విమర్శించారు. అమానవీయ 'అ' ప్రధాని అధికార అహంకార రాజకీయ తీరు ఇలాగే ఉంటుంది.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
సంచారవాణి: 9490204545

వచ్చే ఏడాది మోదీ
జెండా ఆవిష్కరణ ఇంట్లోనే

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- ఎర్రకోట వద్ద వేడులకు దూరంగా...

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రతిపక్షాలను విమర్శించినందుకు ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. వచ్చే ఏడాది కూడా ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరిస్తానని ప్రధాని నరేంద్ర మోదీ అహంకారంతో మాట్లాడుతున్నారని ఖర్గే అన్నారు. గెలిచాక మళ్లీ మళ్లీ వస్తామని ప్రతి ఒక్కరూ చెబుతుంటారని, కానీ గెలుపు ఓటములు ప్రజల చేతుల్లో, ఓటర్ల చేతుల్లోనే ఉన్నాయని తెలిపారు. 'అవును... వచ్చే ఏడాది మరోసారి మోదీ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. కానీ తన ఇంట్లోనే ఆ పని చేస్తారు' అని ఖర్గే వ్యాఖ్యానించారు. 'మోదీ అహంకారంతో మాట్లాడుతున్నాడు. ఇప్పుడు 2023 అని, 2024లో (ఎర్రకోటలో) మళ్లీ జాతీయ జెండాను ఆవిష్కరిస్తానని చెప్పడం 'దురంకార్, అహంకార్' (అహంకారం) అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. ప్రధాని వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా 'అతను (పీఎం) కూడా ప్రతిపక్షాలను విమర్శిస్తూనే ఉంటారని, స్వాతంత్ర్య దినోత్సవం రోజు కూడా అలాగే కొనసాగిస్తే, అతను ఎలాంటి భారతదేశాన్ని తయారు చేస్తారని అన్నారు. 'అతను (ప్రధాన మంత్రి) మళ్లీ జెండాను ఆవిష్కరిస్తారు. కానీ అతని స్వంత ఇంట్లో' అని ఖర్గే అన్నారు. ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు గైర్హాజరయ్యారు. కాంగ్రెస్ నేత రాజీవ్ శుక్లా మాట్లాడుతూ వచ్చే ఏడాది ఎర్రకోటలో ఎవరు ప్రసంగించాలో నిర్ణయించే అధికారం ప్రజలదేనని, దానిని వారికే వదిలేయాలన్నారు. మరో కాంగ్రెస్ నేత అజోయ్ కుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలోని అవినీతిని ప్రధాని మోదీ నియంత్రించలేకపోతున్నారని కాగ్ నివేదికల్లో వెల్లడయిందని ఆరోపించారు. ఆప్ ఎంపీ సుశీల్ కుమార్ గుప్తా మాట్లాడుతూ అధికారంలో ఉండి తొమ్మిదేళ్లు గడిచినా రిపోర్ట్ కార్డు ఇవ్వలేకపోవడం తనకు వింతగా అనిపిస్తోందని అన్నారు. 'వచ్చే ఏడాది రిపోర్ట్ కార్డు ఇస్తానని చెప్పడం ఎలా సాధ్యం?. ప్రజలు అతనికి తగినంత సమయం ఇచ్చినందున అతను తన రిపోర్ట్ కార్డు ఇవ్వాలి. వచ్చే ఏడాది జాతీయ జెండాను ఎగురవేసేందుకు ఎవరికి ప్రాధాన్యత ఇస్తారన్నది ప్రజల సంకల్పం' అని రాజ్యసభ ఎంపీ అన్నారు.

ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో...

ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దూరంగా ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ఈ కార్యక్రమంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా కూడా ఉన్న ఖర్గే కోసం రిజర్వ్ చేసిన కుర్చీ ఖాళీగా కనిపించింది. అయితే, ఆయన తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తరువాత కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్న కార్యక్రమంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ఖర్గే ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన అసంఖ్యాక భారతీయుల త్యాగాలకు వందనం, వారు జాతీయ ఉద్యమానికి కృషి చేయడమే కాకుండా భారతదేశానికి బలమైన పునాదిని కూడా వేశారని తెలిపారు. 'ఈ రోజు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, స్వయంప్రతిపత్త సంస్థలు... ఈ మూడూ తీవ్ర ప్రమాదంలో ఉన్నాయని చెప్పడం నాకు బాధ కలిగించింది' అని అన్నారు. తనకు కొన్ని కంటి సమస్యలు ఉన్నాయని కాంగ్రెస్ నేత చెప్పారు. 'ప్రోటోకాల్స్ ప్రకారం నేను ఉదయం 9.20 గంటలకు నా నివాసంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాల్సి వచ్చింది. అప్పుడు నేను కాంగ్రెస్ కార్యాలయానికి వచ్చి ఇక్కడ కూడా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయవలసి వచ్చింది. అందువల్ల నేను ఇక్కడికి చేరుకోలేకపోయాను. 'భద్రత చాలా పటిష్టంగా ఉంది. వారు ప్రధాన మంత్రి వెళ్లేలోపు మరెవరినీ విడిచిపెట్టరు. నేను సమయానికి ఇక్కడికి చేరుకోలేను. భద్రత కారణంగా అక్కడికి వెళ్లకపోవడమే మంచిదని నేను అనుకున్నాను' అని ఖర్గే తెలిపారు. తన రికార్డ్ చేసిన సందేశంలో, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం భారతదేశానికి ఆత్మ అని అన్నారు. 'గత కొన్నేళ్లుగా దేశం అభివృద్ధి చెందినట్లు కొందరు చూపిస్తున్నారు. కానీ అది నిజం కాదు. బ్రిటీష్ వారు దేశం విడిచి వెళ్లినప్పుడు దేశంలో ఒక సూది కూడా తయారు చేయని పరిస్థితి. అప్పుడు పండిట్ నెహ్రూ పెద్ద చొరవ తీసుకున్నారు. ఉక్కు కర్మాగారాల ఏర్పాటు, ఆనకట్టలు, ఐఐటీ, ఐఐఎం, ఏఐఐఎంఎస్ వంటి సంస్థలను స్థాపించారు. హరిత విప్లవం తీసుకొచ్చిన ఇందిరాగాంధీ-లాల్ బహదూర్ శాస్త్రి భారతదేశాన్ని స్వావలంబనగా మార్చారు' అని ఖర్గే తెలిపారు. గొప్ప వ్యక్తులు గత చరిత్రను తుడిచిపెట్టలేరని, వారి స్వంత చరిత్రను సృష్టించారని అన్నారు. 'పేరు మార్పు సమస్యలను పునరావృతం చేస్తున్న వారు ఇప్పటికే ఉన్న పథకాల పేర్లను మార్చారు' అని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఎక్కడ అన్యాయం జరిగినా కాంగ్రెస్ పార్టీ 'న్యాయాన్ని స్థాపిస్తుంది. పోరాడుతుంది. దాని గొంతును పెంచుతుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు తన ప్రసంగాన్ని ముగించారు. పరువు నష్టం కేసులో సుప్రీం కోర్టు స్టే విధించడంతో ఇటీవల ఎంపీగా తిరిగి వచ్చిన పార్టీ సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కూడా ఎర్రకోటలో కనిపించలేదు.

విభేదాలకు అతీతంగా ఎదుగుదాం: మమత

కోల్‌కతా: ప్రకాశవంతమైన, సామర్థ్యంతో కూడిన భారతదేశం కోసం విభజనవాదాన్ని, విభేదాలను పక్కనబెట్టాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) లో ట్వీట్ చేశారు. 'మన చరిత్రలోని అధ్యాయాలు ధైర్యం, లాఘవంతో రాయబడ్డాయి. మనం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్నప్పుడు, మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం... వారు పోరాడి సాధించిన విలువలను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేద్దాం... వారి త్యాగాలు మనల్ని అంకితభావంతో ముందుకు సాగడానికి ప్రేరేపించనివ్వండి...విభేదాలకు అతీతంగా ఎదుగుదాం, మన విభేదాలను పక్కన పెట్టి ఉజ్వలమైన, మెరుగైన భారతదేశం వైపు మన ప్రయాణంలో ఐక్యంగా నిలబడదాం' అని ఆమె తెలిపారు. 'నా తల్లులు, సోదర సోదరీమణులందరికీ 77వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు' అని ఆమె ముగించారు. సోమవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన తృణమూల్ కాంగ్రెస్ నిర్వహించిన కార్యక్ర మంలో మమత మాట్లాడుతూ... ప్రధానిగా నరేంద్ర మోదీకి ఎర్రకోటపై నుంచి ప్రసంగించడం ఇదే చివరిసారని తెలిపారు. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' విజయం సాధిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

'భారత మాత' ప్రతి భారతీయుని గొంతు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: 'భారత మాత' అనేది ఎంత బలహీనమైనా, బలవంతుడైనా ప్రతి భారతీయుని గొంతు అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తన సందేశంలో ఆయన కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు తన 145 రోజుల భారత్ జోడో యాత్ర గురించి మాట్లాడారు. తన ప్రయాణంలో ప్రజలు తనను ఎలా కలిశారో వివరించారు. 'నా ప్రేమ వస్తువు అకస్మాత్తుగా తనను తాను బహిర్గతం చేసింది. నా ప్రియమైన భారత మాత భూమి కాదు. ఇది ఆలోచనల సమితి కాదు. ఇది ఒక నిర్దిష్ట సంస్కృతి, చరిత్ర లేదా మతం కాదు. ప్రజలు కేటాయించిన కులం కూడా కాదు. 'బలహీనమైనా, ఎంత బలహీనమైనా ప్రతి ఒక్క భారతీయుని స్వరం భారతదేశం. భారతదేశం ఆనందం, భయం బాధ అన్ని స్వరాలలో లోతుగా దాగి ఉంది' అని ఆయన అన్నారు. భారతదేశాన్ని వినడానికి, నా స్వంత స్వరం, నా కోరికలు, నా ఆశయాలు మౌనంగా ఉండవలసి వచ్చింది. భారతదేశం తనలో ఒకరితో మాట్లాడుతుంది. కానీ ఒకరు వినయంగా, పూర్తిగా మౌనంగా ఉంటే మాత్రమే' అని తెలిపారు. యాత్ర ప్రయాణంలో తన అనుభవాన్ని పంచుకుంటూ, 'ఇది ఎంత సరళంగా మారింది. సముద్రంలో మాత్రమే లభించే దాని కోసం నేను నదిలో వెతుకుతున్నాను. 'మాటలు హృదయం నుంచి వస్తే అవి హృదయంలోకి ప్రవేశిస్తాయి' అని పర్షియన్ కవి రూమిని ఉటంకించాడు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు అయిన రాహుల్ తన యాత్ర ప్రారంభించిన వెంటనే పాత గాయం తన మోకాలి నొప్పి గురించి మాట్లాడారు. అయితే ప్రజల సంఖ్య పెరగడం, వారి శక్తిని పొందడంతో తగ్గిందని అన్నారు. 'ఇది నిశ్శబ్ద శక్తి నాకు సహాయం చేస్తూనే ఉంది. చీకటి అడవిలో తుమ్మెదలు వలె, అది ప్రతిచోటా ఉంది. నాకు ఇది నిజంగా అవసరమైనప్పుడు, అది సహాయం చేయడానికి, మార్గనిర్దేశం చేయడానికి ఉంది' అని రాహుల్ గాంధీ తెలిపారు.

మోదీకి ఇదే చివరి జెండా ఆవిష్కరణ: లాలూ

పాట్నా: దిల్లీలో ఎర్రకోటపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ చివరిసారిగా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్ మంగళవారం అన్నారు. ఇక్కడి తన నివాసంలో భార్య రబ్రీదేవితో కలిసి లాలు స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ వేడుకలో భార్యాభర్తలైన ఇద్దరు బీహార్ మాజీ ముఖ్యమంత్రులు జాతీయ జెండాను ఆవిష్కరించడం విశేషం. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'స్వాతంత్ర్య దినం సందర్భంగా దేశ ప్రజలకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ వంటి గొప్ప వ్యక్తులకు నా నివాళులు అర్పిస్తున్నాను... వారి సేవలను దేశం ఎప్పటికీ మరచిపోలేను' అని యాదవ్ విలేకరులతో అన్నారు. ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో పోరాడుతున్న యాదవ్...

అనేక దశాబ్దాలుగా సాగిన తన రాజకీయ జీవితంలో బీజేపీని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత వచ్చే ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాన మళ్లీ ప్రధాని హోదాలో మోదీ ఎర్రకోటపై నుంచి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించగలరా అని కొందరు జర్నలిస్టులు యాదవ్‌ను ప్రశ్నించగా... ఎట్టి పరిస్థితుల్లోనూ అది జరగదని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం మావంతు వస్తుందంటూ బదులిచ్చారు.

నేడు దక్షిణాదిరాష్ట్రాల మహిళాకమిషన్ల భేటీ

తిరువనంతపురం: జాతీయ మహిళా కమిషన్ బుధవారం దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రాంతీయ సమావేశం తిరువనంతపురంలో నిర్వహించనుంది. కేరళ మహిళా కమిషన్ (కేడబ్ల్యుసీ) ఈ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సమావేశంలో ఐదు దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు కేంద్రపాలిత లక్షద్వీప్,పుదుచ్చేరి నుండి మహిళా కమిషన్లు, మహిళా శిశు సంక్షేమశాఖలు, సామాజిక న్యాయ శాఖలు, స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రతినిధులు, విద్యావేత్తలు పాల్గొంటారు. ఈ మేరకు కేడబ్ల్యూసీ ఓ ప్రకటనలో తెలిపింది.

పీఎఫ్ఐ సభ్యుల బెయిల్ వ్యాజ్యాలపై ఈడీ స్పందన కోరిన కోర్టు

న్యూఢిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) కి చెందిన ముగ్గురు సభ్యుల బెయిల్ వ్యాజ్యాలపై దిల్లీ కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నుంచి స్పందన కోరింది. మహ్మద్ ఇలియాస్, మహ్మద్ పర్వేజ్ అహ్మద్, అబ్దుల్ ముఖీత్ దాఖలు చేసిన దరఖాస్తులపై ప్రత్యేక న్యాయమూర్తి శైలేందర్ మాలిక్ ఈడీకి నోటీసులు జారీ చేశారు. అహ్మద్ పిటిషన్‌పై ఆగస్టు 24లోగా, ఇలియాస్, ముఖీత్ దాఖలు చేసిన మరో రెండు దరఖాస్తులకు ఆగస్టు 26లోగా సమాధానం ఇవ్వాలని కేంద్ర దర్యాప్తు సంస్థను న్యాయమూర్తి ఆదేశించారు. నిందితులు గత వారం కోర్టు ముందు దరఖాస్తును సమర్పించారు. వారిపై ఇప్పటికే పూర్తయినందున ఇకపై దర్యాప్తు అవసరం లేదని, వారిని తదుపరి కస్టడీలో ఉంచడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొంది. నిందితులను సెప్టెంబరు 22, 2022న అరెస్టు చేయగా, ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈడీ వారిపై నవంబరు 19, 2022న ప్రాసిక్యూషన్ ఫిర్యాదు దాఖలు చేసింది. కొన్నేళ్లుగా రూ.120 కోట్ల అక్రమార్జనకు సంబంధించిన కేసు. ఉగ్రవాద కార్యకలాపాలతో పీఎఫ్ఐకి సంబంధాలున్నాయని ఆరోపిస్తూ గత ఏడాది సెప్టెంబరులో పీఎఫ్ఐని కేంద్రం నిషేధించింది.

నితీశ్ సభలోకి దూసుకొచ్చిన యువకుడు

పాట్నా: స్వాతంత్ర్యదినం సందర్భంగా నిర్వహించిన సభలో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ప్రసంగిస్తుండగా ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. భద్రతా వలయాన్ని దాటుకుని నితీశ్ వైపునకు పరుగులు తీయబోయాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది...ఆ యువకుడిని అక్కడికక్కడే అడ్డుకోగలిగారు. ఆ యువకుడి పేరు కూడా నితీశ్ కుమార్ కావడం విశేషం. స్వాతంత్ర్యదినం సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పాట్నాలోని గాంధీ మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలోకి నితీశ్ కుమార్ అనే 26 ఏళ్ల యువకుడు పరుగు పరుగున దూసుకొచ్చాడు. ఆయన చేతిలో ఓ పోస్టర్ ఉంది. తన తండ్రి బీహార్ మిలిటరీ పోలీస్ ఉద్యోగి అని, ఆయన ఐదేళ్ల క్రితం విధి నిర్వహణలో ఉండగానే మరణించారని, తనకు కారుణ్య ప్రాతిపదికపై ప్రభుత్వోద్యోగం ఇవ్వాలని ఆ పోస్టర్లో రాశాడు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న సమయంలో యువకుడు నితీశ్ కుమార్ సీఎం వద్దకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది తక్షణమే స్పందించి, ఆ యువకుడిని అడ్డుకుని, అక్కడి నుంచి పంపేశారు. ఈ సంఘటనపై అత్యున్నత స్థాయి దర్యాప్తునకు పాట్నా జిల్లా యంత్రాంగం ఆదేశించింది. పాట్నా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ సింగ్ మాట్లాడుతూ, సీఎం సభలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన యువకుడి పేరు నితీశ్‌కుమార్ అని గుర్తించామని, ఆయన తండ్రి పేరు రాజేశ్వర్ పాశ్వాన్ అని తెలిపారు. ముంగేర్ జిల్లాకు చెందిన రాజేశ్ బీహార్ మిలిటరీ పోలీస్ ఉద్యోగి అని, ఆయన ఐదేళ్ల క్రితం విధి నిర్వహణలో ఉండగా మరణించారని తెలిపారు. తన తండ్రి విధి నిర్వహణలో మరణించినందువల్ల తనకు ప్రభుత్వోద్యోగం పొందే అర్హత ఉందని నితీశ్ కుమార్ (26) చెబుతున్నారని తెలిపారు. సీఎంను కలవాలని వచ్చినట్లు చెప్పాడన్నారు.

సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాథక్ మృతి

న్యూఢిల్లీ: ప్రముఖ సామాజిక కార్యకర్త, సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాథక్ గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. 80 ఏళ్ల పాథక్ దిల్లీలోని ఎయిమ్స్ చికిత్స పొందుతూ మంగళవారం 1.42 గంటలకు కన్నుమూశారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉదయం పాథక్ జాతీయ జెండాను ఎగురవేసి.. ఆ వెంటనే కుప్పకూలిపోయారని ఆయన కుటుంబ సభ్యుడొకరు తెలిపారు. పరిశుభ్రత, సామాజిక సంస్కరణోద్యమ (సులభ్ శానిటేషన్ అండ్ సోషల్ మూవ్‌మెంట్) వ్యవస్థాపకుడు. బహిరంగ మల విసర్జనకు వ్యతిరేకంగా పోరాడిన పాథక్..కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి కృషి చేశారు. బిందేశ్వర్ పాథక్ 1943లో బీహార్‌లోని హాజీపూర్‌లో జన్మించారు. సఫాయీ కర్మచారీ కుటుంబాలతో కలిసి ఉండి.. వారి కష్టాలను తెలుసుకున్న ఆయన 1970లో సులభ్ ఇంటర్నేషనల్‌ను స్థాపించారు. సాంకేతిక ఆవిష్కరణ, మానవతా సూత్రాల సమ్మిళితంగా పని చేయడమే దాని ఉద్దేశం. ఈ సంస్థ మానవహక్కుల, పర్యావరణ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ వంటి వాటిని ప్రోత్సహిస్తుంది. సులభ్ ఇంటర్నేషనల్ కింద ఇళ్లలో 13 లక్షల టాయిలెట్లు, 5.4 కోట్ల ప్రభుత్వ టాయిలెట్లను నిర్మించారు. సఫాయీ కర్మచారీ జీవితాల్లో పాథక్ తీసుకువచ్చిన మార్పునకు, పర్యావరణ పరిశుభ్రత, సాంప్రదాయేతర ఇంధన వనరుల వాడకం వంటి విషయాల్లో ఆయన చేసిన కృషికి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 1991లో కేంద్రప్రభుత్వం మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ భూషణ్‌తో సత్కరించింది. పాథక్ భారత్ రైల్వేకు చెందిన స్వచ్ఛ రైల్ మిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా పని చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున భాగల్‌పూర్ నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారు. పలు పుస్తకాలను రచించారు.

ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...బిందేశ్వర్ పాథక్ మృతిపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం ఈ దేశానికి తీరని లోటు..సమాజం, అణగారిన వర్గాల పురోగతి కోసం ఆహర్నిశలు కృషి చేశారు. ఆయన స్వచ్ఛ భారత్ మిషన్‌కు అనిర్వచనీయమైన సహకారం అందించారు అని మోదీ ట్వీట్ చేశారు.

ప్రధాని ప్రసంగం... 90 నిమిషాలు

న్యూఢిల్లీ: 77 వ స్వాతంత్ర్యదిన వేడుకల సందర్భంగా ఎర్రకోటపై మంగళవారం ఉదయం జాతీయ జెండా ఎగురవేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. దేశ ప్రజలను ఉద్దేశించి సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఏకధాటిగా 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కొత్త రికార్డులను నెలకొల్పారు. వరుసగా పదేళ్లలో పదిసార్లు ఎర్రకోటపై మువ్వన్నెల జెండాను ఆవిష్కరించిన తొలి కాంగ్రెస్‌యేతర ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ నిలిచారు. 2014 లో తొలిసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ... 2019 ఎన్నికల్లో మరోసారి గెలిచారు. ఇప్పటివరకు 10 సార్లు ప్రసంగించిన నరేంద్ర మోదీ... సగటు ప్రసంగ సమయం 82 నిమిషాలుగా ఉంది. అయితే ఇప్పటివరకు భారత దేశ చరిత్రలో ఇతర ప్రధానులు మాట్లాడిన సగటు ప్రసంగ సమయం కంటే ఇది ఎక్కువ కావడం విశేషం. 2014 లో ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఎర్రకోట వేదిక నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి తొలి ప్రసంగం చేశారు. ఆ సంవత్సరం 65 నిమిషాల పాటు మోదీ ప్రసంగిచారు. ఆ తర్వాత ఏడాది 2015 లో 86 నిమిషాలు, 2016 లో 96 నిమిషాలు మాట్లాడారు. ఇక 2017 లో 56 నిమిషాలు, 2018 లో 83 నిమిషాలు, 2019 లో 92 నిమిషాలు, 2020 లో 90 నిమిషాలు, 2021 లో 88 నిమిషాలు, 2022 లో 74 నిమిషాల పాటు మాట్లాడారు. ఇక ఈసారి ఏకంగా 90 నిమిషాల పాటు సుదీర్ఘంగా నరేంద్ర మోదీ ప్రసంగించారు. మొత్తంగా 10 ఏళ్లలో ప్రధాని మాట్లాడిన సమయం సగటు ప్రసంగం నిడివి 82 నిమిషాలు కాగా.. ఇప్పటివరకు భారతదేశంలో ఏ ప్రధాని కూడా సగటుగా ఇంత సమయం ప్రసంగించిన సందర్భాలు లేవు.

17 సార్లు ప్రసంగించిన జవహర్‌లాల్ నెహ్రూ

ఇక కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. 1947లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మొట్టమొదటి ప్రసంగం చేశారు. ఆ సందర్భంలో నెహ్రూ 24 నిమిషాల పాటు మాట్లాడారు. మరోవైపు.. ప్రధాని హోదాలో ఇప్పటివరకు అత్యధిక స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాలు చేసింది కూడా నెహ్రూనే కావడం గమనార్హం. జవహర్ లాల్ నెహ్రూ.. మొత్తంగా 17 సార్లు స్వాతంత్ర్య దినోత్సవం నాడు దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆ తర్వాత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 16 సార్లు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేశారు. 1972 లో ఇందిరాగాంధీ సుదీర్ఘంగా 54 నిమిషాల పాటు ప్రసంగించారు. మరోవైపు.. మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ కేవలం ఒకే ఒక్కసారి ఎర్రకోట నుంచి జాతిని ఉద్దేశించి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేశారు. 1997లో 71 నిమిషాల పాటు మాట్లాడిన ఐకే గుజ్రాల్.. ప్రధాని మోదీ తర్వాత రెండో అత్యధిక సగటు ప్రసంగ సమయం కలిగిన ప్రధానిగా నిలిచారు. మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, అటల్ బిహారీ వాజ్‌పేయీ తక్కువ సమయం ప్రసంగాలు చేసినవారిలో ఉన్నారు. 2012 లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ 32 నిమిషాలు.. 2013లో 35 నిమిషాలు మాట్లాడారు. వాజ్‌పేయీ 2002లో 25 నిమిషాలు, 2003లో 30 నిమిషాల పాటు ఎర్రకోట నుంచి ప్రసంగించారు.

మణిపూర్‌లో కళతప్పిన పంద్రాగస్టు

- నిర్మానుష్యంగా ఇంఫాల్ రోడ్లు
- వెలవెలబోయిన వేడుకలు

ఇంఫాల్: మణిపూర్‌లో ఆందోళనకర పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో 77వ స్వాతంత్ర్య వేడుకలు వెలవెలబోయాయి. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఘనంగా కార్యక్రమాలు జరిగినప్పటికీ స్థానిక వేడుకలు కళతప్పాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. మంగళవారం కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు రాష్ట్రంలో సమ్మె జరిగింది. నెలల తరబడి సాగిన వర్గ పోరులో 150 మంది ప్రాణాలు పోయాయి. వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ పరిస్థితుల్లో పంద్రాగస్టు వేడుకలకు హాజరుకావాలని లోయ, గిరి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఉత్తర్వులు అందాయి. వారంతా ఉదయాన్నే తమ తమ కార్యాలయాలకు వెళ్లి జెండా వందన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సంబరంగా జరగాల్సిన వేడుకలు పరిమిత సంఖ్య హాజరీతో నామమాత్రంగా జరిగినట్లు కొందరు ఉద్యోగులు తెలిపారు. సర్వం కోల్పోయిన రోడ్డున పడ్డ వారికి కొందరు ఈ సందర్భంగా ప్రత్యేక భోజనాన్ని అందజేశారు. రాజధాని నగరంలో ప్రధాన రహదారుల వెంబడి ఇళ్లపై, ముఖ్యమైన భవనాలపై త్రివర్ణ జెండాలు ఎగిరాయి. ఇంఫాల్‌లో స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు భారీగానే జరిగాయి. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జాతీయ గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు, పురస్కారాలు, సర్టిఫికెట్ల ప్రదానం వంటివి జరిగాయి. చురచాంద్పూర్‌లో కుకీ-జో గ్రామ వలంటీర్లు వేడకలు నిర్వహించగా అధికారులు పాల్గొన్నారు. రెండు దశాబ్దాల్లో మొదటిసారి రాష్ట్రంలో హిందీ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రసారం చేశారు. జిల్లాలోని రెంగ్‌కయ్ (లాంక)లో చిత్రప్రదర్శనకు గిరిజన సంఘమైన హమర్ విద్యార్థుల సమాఖ్య (హెచ్ఎస్ఏ) ఏర్పాట్లు చేసింది. 1998లో కుచ్ కుచ్ హోతా హై చిత్రాన్ని ఇదే సంఘంవారు ప్రదర్శించారు.

హింస వద్దు-శాంతి ముద్దు: సీఎం బీరేన్ సింగ్

మణిపూర్ ప్రజలకు ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ శాంతి సందేశమిచ్చారు. మణిపూర్ ప్రజలకు దేశం అండగా ఉందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులకు శాంతి ఒక్కటే మార్గమని అన్నారు. మనస్పర్థలు, విదేశీ కుట్రల వల్ల విలువైన ప్రాణాలు పోయాయన్నారు. హింసను ఆపేయాలని, శాంతిని నెలకొల్పాలని, మళ్లీ ప్రగతి పథంలో ముందుకు సాగాలని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పిలుపునిచ్చారు. సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు, బాధితులను స్థిరపర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సింగ్ తెలిపారు.

కార్యాచరణతోనే భారత్ అభివృద్ధి

న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్



న్యూఢిల్లీ : 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కార్యచరణ అవసర మని, చట్టబద్ధ పాలన ప్రజాస్వామ్యానికి పునాది అని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ మంగళవారం అన్నారు. సుప్రీం కోర్టు ప్రాంగణంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయ మంత్రి ప్రసంగించారు. సుప్రీం కోర్టు పచ్చిక బయళ్లలో జాతీయ జెండాను ఆవిష్కరించిన భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ న్యాయాన్ని పొందేందుకు ఉన్న అడ్డంకులను తొలగించడమే భారత న్యాయ వ్యవస్థ ముందున్న అతిపెద్ద సవాలు అని, న్యాయస్థానాలను అందు బాటులోకి తీసుకురావడానికి, అందరినీ కలుపుకొని పోవడానికి ప్రాధాన్యతా ప్రాతిపదికన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని తెలిపారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' గా జరుపుకుంటున్నప్పుడు, దేశం ప్రయాణాన్ని విశ్లేషించడానికి, భారతదేశం తన గమ్యాన్ని చేరుకుందో లేదో తెలుసుకోవడానికి మేఘవాల్ కుప్లంగా తన హిందీలో ప్రసంగంలో తెలిపారు. 'గత 75 ఏళ్లుగా ఎలా ఉంది. ఎక్కడికి చేరుకున్నామో, గమ్యం చేరామో లేదో... అన్నింటినీ విశ్లేషించే అవకాశం ఉంది. కానీ 2047 నాటికి మనం ఎక్కడికి చేరుకుంటామో, ఈరోజు ఎర్రకోట ప్రాకారాల నుంచి ప్రధాన మంత్రి గమ్యాన్ని ప్రకటించారు' అని ఆయన అన్నారు. ఏదైనా దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు 'కార్యచరణ' అవసరమని మేఘవాల్ తెలిపారు. 'మనం ఒక కార్యచరణను సిద్ధం చేయాలి.... భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చే ప్రక్రియలో అందరూ కలిసి కదలాలి' అని న్యాయ మంత్రి అన్నారు. ప్రత్యేక భౌగోళిక ప్రాంతం, సార్వభౌమాధికారం, జెండా, కరెన్సీ, భాష అనే ఐదు ముఖ్యమైన అంశాలు లేకుండా దేశం ఉనికిలో ఉండదని మేఘవాల్ చెప్పారు. పాశ్చాత్య తత్వవేత్తల ప్రకారం, మాగ్నా కార్టాకు ముందు 'చట్టం, మనిషి పాలన మధ్య వైరుధ్యం' ఉండేదని ఆయన అన్నారు. మాగ్నా కార్టాలోని సెక్షన్ 35 భవిష్యత్తులో చట్టబద్ధమైన పాలన ఉంటుందని, ఇది ప్రజా స్వామ్యానికి పునాది అని మేఘవాల్ అన్నారు. అయితే, గౌతమ బుద్ధుని కాలంలో జరిగిన సభలలో చూసినట్లుగా, సంత్ రవిదాస్, ఇతరులు పేర్కొన్నట్లుగా భారతదేశానికి ప్రజాస్వామ్య సంప్రదాయాల చరిత్ర ఉందని ఆయన తెలిపారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్, లాయర్ల ఛాంబర్స్‌తో సహా వారి సమస్యలను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోందని ఆయన న్యాయవాదులకు హామీ ఇచ్చారు. ఈ-కోర్టులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాన్ని బలోపేతం చేయడంతో సహా అనేక మార్పులను అమలు చేసే పనిలో సీజేఐ ఉన్నట్లు న్యాయ మంత్రి వివరించారు.

సమగ్ర గ్రామీణ వ్యవసాయ కార్మికచట్టం అమలు చేయాలి

'ఉపాధి' పథకానికి అధిక నిధులు కేటాయించాలి

బీకేఎంయూ ఉపాధ్యక్షులు రామమూర్తి

విశాలాంధ్ర-విజయవాడ: గ్రామీణ వ్యవసాయ కూలీలకు కేంద్రం సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం అమలుచేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూని యన్ (బీకేఎంయూ) జాతీయ ఉపాధ్యక్షులు పి.రామమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన విజయవాడలోని దాసరి నాగభూషణ రావు భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామమూర్తి మాట్లాడుతూ... ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో కూలీలతో అవసరం లేకుండా రైతులు... యంత్రాలతో పనులు చేస్తున్నారని, దీనివల్ల వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా పోతున్నాయన్నారు. సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం అమలుచేస్తేనే వారికి ఉపాధి దొరుకుతుందన్నారు. యూపీఏ ప్రభుత్వంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల సంరక్షణ చట్టాన్ని తీసుకురాగా... మోదీ ప్రభుత్వం ఆ చట్టాలను నీరుగారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఉపాధి హామీ పథకం వల్ల ఉపయోగం లేదని మాట్లాడటం దారుణం అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్ల స్థలాలు ,పక్కా గృహాలు కట్టుకోవడానికి రాష్ట్రాలకు అధిక మొత్తంలో డబ్బులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు పాండోపాధ్యాయ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఇవ్వాలని బీకేఎంయూ డిమాండ్ చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒక సెంటు ఇంటి స్థలం ఇస్తే ఇంటి నిర్మాణం ఏ విధంగా జరుగు తుందని ప్రశ్నించారు. పుదుచ్చేరి ప్రభుత్వం గృహ నిర్మాణానికి కావలసిన ఇంటి స్థలంతో పాటు ఐదున్నర లక్షల నగదు ఇస్తూ... ఇంటి నిర్మాణానికి ఉపయోగపడే అన్ని రకాల వస్తువులను ఉచితంగా ఇస్తోందని తెలిపారు. అక్కడ గ్రామీణ ఉపాధి చట్టంలో పనిచేసే ఉపాధి కూలీలకు కూడా రోజు కూలి రూ.293 ఇస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాన్ని గ్రామ, గ్రామాన ఏర్పాటు చేసి గ్రామీణ కష్టజీవుల సమస్యలపై దృష్టి పెట్టి ఉద్యమించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ ... రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పక్కా ఇళ్లను నిర్మించడంలో విఫలమైం దన్నారు. భూ పంపిణీ చేయకుండా, అసైన్డ్ చట్టం సవరణ పేరుతో, యాజమాన్య హక్కులు కల్పిస్తూ... రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా ఇస్తామని పేదలను మోసం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులను అమలు చేసేంతవరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో పోరాటం నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. ఉపాధి హామీలో 200 రోజుల పని దినాలు, రోజు వేతనం రూ.600లకు పెరిగే వరకు పోరాటాలు చేయాలన్నారు. గ్రామ సంఘాలు ఏర్పాటు చేసి సభ్యత్వాన్ని చేర్పిస్తూ సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు ఆ సమస్యలపై ఉద్యమించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు సీపీఐ అధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు జాతా కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22 వ రాష్ట్ర మహాసభలు బాపట్లలో సెప్టెంబర్ 25, 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నామని, మొదటిరోజు 10 వేల మంది గ్రామీణ కష్టజీవులతో మహా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ బహిరంగ సభలో జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. రెండు రోజులు పాటు 400 మందితో ప్రతినిధుల మహా సభలు జరపాలని నిర్ణయించామన్నారు. రాష్ట్ర కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, బాపట్ల జిల్లా కార్యదర్శి సింగరకొండ, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదంలో జాతీయ సమైక్యత: సురవరం

సీఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుక

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: హైదరాబాద్ కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో భారత 77వ స్వాతంత్ర్యదిన వేడుకలు ఘనంగా జరిగాయి. చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురవరం ప్రసంగిస్తూ... కమ్యూనిస్టులు, సోషలిస్టులు, మరెం దరో మహనీయుల త్యాగాలవల్ల మన దేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. 76 సంవత్సరాలు పూర్తయినప్పటికీ స్వాతంత్ర్య ఫలాలు పీడిత, తాడిత, సామాన్య ప్రజలకు అందుబాటులోకి రాలేదని ఆవేదన

వ్యక్తం చేశారు. దేశంలో కులమత విద్వేషాలు రగులుతూ, జాతీయ సమైక్యత, లౌకికవాదం ప్రమాదంలో పడ్డాయన్నారు. సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు, ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి బీవీ విజయలక్ష్మి, సీఆర్ ఫౌండేషన్ హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కూనంనేని రజిని, మహిళ సంక్షేమ కేంద్రం డైరెక్టర్ కృష్ణకుమారి, ప్రిన్సిపాల్ జోశ్యభట్ల కల్పన, వృద్ధాశ్రమం సలహామండలి సభ్యులు డాక్టర్ పి సరస్వతి, ఎస్ తుకారాం, రాజేంద్రరావు, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి వీ చెన్నకేశవరావు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా మహిళా సంక్షేమ కేంద్రం వృత్తి విద్య కోర్సుల విద్యార్థినులు దేశభక్తి గీతాలు ఆలపించారు.

దేశాన్ని కమ్మేస్తున్న 'విభజన' కారుమేఘం

తిరువనంతపురం: దేశం 77వ స్వాతంత్ర్య దినాన్ని జరుపుకుంటున్న తరుణంలో భారతీయ గణతంత్రాన్ని కులం, జాతి పేరిట విభజనల ఘటనల రూపేణ కారుమేఘం కమ్మేస్తోందని, లౌకిక వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తోందని కేరళ ముఖ్య మంత్రి పినరయి విజయన్ అన్నారు. ఫెడరల్ విలువలు, సిద్ధాంతాలు తుంగలో తొక్కేస్తున్నట్లు వ్యాఖ్యానించారు. దేశ లౌకిక వ్యక్తిత్వాన్ని, ఫెడరల్ విలువలను పరిరక్షించేందుకు ప్రతి పౌరుడు సంకల్పించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్క రించుకొని మంగళవారం సెంట్రల్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని విజయన్ ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగిస్తూ వేర్వేరు రంగాల్లో కేరళ సాధించిన పురోగతి గురించి తెలిపారు. ఐటీ, మౌలిక వసతులు, సంక్షేమంలో దూసుకెళుతోందని చెప్పారు. 2025 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించాలని లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్న రాష్ట్రం దేశంతో మరొకటి లేదన్నారు. 100వ స్వాతంత్ర్య దినం నాటికి ప్రపంచ స్థాయి రాష్ట్రంగా కేరళను నిలపాలన్నదే ఆకాంక్ష అని విజయన్ అన్నారు. కేవలం సంకెళ్లను తెగొట్టడమే కాదు వైవిధ్య, సమ్మిళత భారతం కోసం స్వాతంత్ర్య సమరం జరిగిందని నొక్కిచెప్పారు. రాజ్యాంగ ప్రజాస్వామ్య ఆలోచనతో జరిగిన పోరాట ఫలితమే భారత దేశమని తెలిపారు. ఐక్యత, లౌకిక ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథంతో రాష్ట్ర ప్రజలు ఉన్నారని, వీటికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యలైనా మొగ్గలోనే తుంచివేయాలని పిలుపునిచ్చారు. మన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని, ఐక్యతను, ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, శాస్త్రీక ఆలోచనలను మరింత బలోపేతం చేసుకోవాలని 77వ స్వాతంత్ర్య దినాన్ని పురస్కరించుకొని సంకల్పిద్దామని విజయన్ ఉద్ఘా టించారు. 2016 నుంచి రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతోందని, ఆర్థిక పరోగతి సాధిస్తోందని, రూ.81వేల కోట్ల విలువ చేసే వెయ్యికిపైగా ప్రాజెక్టులను చేపట్టినట్లు పినరయి విజయన్ తెలిపారు. లైఫ్ మిషన్ కింద పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నట్లు వెల్లడించారు.

మహిళలకు హింస లేని జీవితం కావాలి

చట్టాలు కఠినంగా అమలు చేయాలి

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): హింస లేని జీవితం మహిళలకు కావాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని అన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అనుబంధ ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య అధ్వర్యంలో మంగళవారం విజయవాడ కాళేశ్వర రావు మార్కెట్ గాంధీ విగ్రహం వద్ద మహిళలకు హింస లేని జీవితం కావాలని ఆకాంక్షిస్తూ కళ్లకు గంతలు కట్టుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాభవాని మాట్లాడుతూ పరాయి స్త్రీని మాతృమూర్తితో సమానంగా గౌరవించే సంస్కృతికి పెట్టింది పేరైన భరతగడ్డపై నేడు మహిళలకు భద్రత కరువయ్యిం దన్నారు. మహిళలపై లైంగిక దాడులు, దౌర్జన్యాలు, హింస నిత్యకృత్యమయ్యాయని తెలిపారు. పోలీసులు, చట్టాలు ఉన్నప్పటికీ, నేరాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అర్ధరాత్రి స్త్రీలు స్వేచ్ఛగా తిరగగలిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యమని మహాత్మాగాంధీ ఉద్ఘాటించారని, కానీ పట్టపగలే తిరగలేని పరిస్థితి దాపురించిందన్నారు. నిర్భయ చట్టం వచ్చిన తర్వాత సైతం అత్యాచార ఘటనలు లేకుండా ఒక్క రోజైనా లేదని ధ్వజమెత్తారు. వరకట్న నిషేధ చట్టం, గృహ హింస చట్టం, లైంగిక వేధింపులు ఇలా మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు వచ్చిన ప్పటికీ మహిళల భద్రతకు మాత్రం హామీ లభించడం లేదని తెలిపారు. దాదాపు 30 సంవత్సరాల నుంచి నిర్ణ యాధికారంలో మహిళలను భాగస్వా మ్యం చేయాలని పోరాటం చేసినా ఫలితం లేదని, ఇది రాష్ట్ర ప్రభుత్వా లకు ఇష్టం లేదా అని ప్రశ్నించారు. మహిళల అక్రమ రవాణా సాగుతోందని, పసిపిల్లలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే శీతాకాలం సమావేశంలోనైనా మహిళలకు రిజర్వేషన్లు, భద్రత, ఆహార భద్రత కల్పించి, ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలని, దోషులను వెంటనే శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, నగర అధ్యక్షులు ఓర్సు భారతి, నాయకులు డి.సీతారావమ్మ, తమ్మిన దుర్గ, దుర్గాసి రమణమ్మ, చింతాడ పార్వతి, బి.శాంత, కొట్టు విజయలక్ష్మీ, బంక ఝాన్సీ, అనసూయ, రాజ్యలక్ష్మీ, పదాల తౌడమ్మ, భాగ్యలక్ష్మీ, సావిత్రి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులు ఆపాలి : మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

తిరుపతి : మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతి గాంధీ విగ్రహం వద్ద ఏపీ మహిళా సమాఖ్య నగర సమితి అధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న హింసను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథి జయలక్ష్మి మాట్లాడుతూ 77 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, మహిళలను రక్షించలేని పాలన ఎందుకని ప్రభుత్వాలను ప్రశ్నించారు. మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత మహిళలకు పూర్తిగా రక్షణ లేకుండా పోయిందని, అందుకు నిదర్శనంగా మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారాలు చేసి చంపేస్తుంటే నోరు మెదపని ప్రధాన మంత్రిని ఏమనాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.నదియా, నగర అధ్యక్ష, కార్యదర్శులు సి.రత్నమ్మ, ఎస్.మంజుల, మహిళా సమాఖ్య నాయకులు ప్రమీల, పార్వతి, విజయ, ప్రియా, అఖిల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జాబితాలోకి విద్య

నీట్ రద్దుకు ఇదొక్కటే మార్గం : స్టాలిన్

చెన్నై: విద్యను రాష్ట్ర జాబితాలోకి బదిలీ చేయాలని, నీట్ పరీక్ష రద్దునకు ఇదొక్కటే మార్గమని తమిళనాడు ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ నొక్కి చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మానవ వనరులు, ఎగుమతులతో పాటు అనేక రంగాలకు మంచి తోడ్పాటును తమిళనాడు అందిస్తోందని మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఉద్ఘాటించారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో 55 వేల ఖాళీల భర్తీని ప్రకటించారు. ద్రవిడ నాయకులు, మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి వంటి వారు ఫెడరల్ భారతంలో రాష్ట్రాలకు సార్వభౌమాధికారాన్ని ఆకాంక్షించారని, అందుకోసం పాటుపడ్డారని గుర్తుచేశారు. ప్రజలతో నేరుగా ముడి పడే అన్ని అంశాలను... ముఖ్యంగా విద్యను రాజ్యాంగంలోని రాష్ట్ర జాబితాలో చేర్చాలని స్టాలిన్ కోరారు. నీట్‌ను సమర్థిస్తున్నందుకు తమిళనాడు గవర్నర్ రవిని దుయ్యబట్టారు. 'దేశం అంటే రాష్ట్రాలతో కూడుకొని ఉంటుంది. వేర్వేరు వర్గాలు, భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, మతాల ప్రజల పురోగతి దృష్ట్యా అభివృద్ధి జరగాలి. దేశవ్యాప్తంగా ద్రవిడ సామాజిక న్యాయ నమూనా ఆధారిత పాలన విస్తరించడానికి మించిన శుభవార్త మరొకటి ఉండబోదు. బీఆర్ అంబేద్కర్, పెరియార్ ఈవీ రామస్వామి వంటి వారు సమతావాద భారతాన్ని ఆకాంక్షించారు. తమిళనాడులో అటువంటి పాలనే సాగిస్తున్నాం. రాష్ట్ర సార్వభౌమత్వం, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం, మాతృభాష అంటే ప్రేమ, మతహక్కు సిద్ధాంతాలతో డీఎంకే పాలన సాగుతోంది. సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం, సమానత్వం, అణగారిన వర్గాల సంక్షేమం, లౌకికవాదం సిద్ధాంతాలను పెంచి పోషించే దేశంగా భారత నిర్మాణం జరగడమే స్వాతంత్ర్య సమరయోధులకు నిజమైన నివాళి. వివక్ష, వ్యత్యాస బీజాలు నాటే దళాలను వేళ్లతో సహా పెకిలించి వేద్దాం. భారతీయుడిగా గర్వించే ప్రతి ఒక్క భారతీయుడికి నా తరపున స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు' అని స్టాలిన్ తెలిపారు.

ప్రజలు సామరస్యంగా జీవించాలి

మంచి సదుపాయాలతోనే దేశం 'విశ్వగురువు' అవుతుంది

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ : భారతదేశం 'విశ్వగురువు'గా మారాలంటే, ప్రజలు సామరస్యంగా జీవించాలని, మంచి విద్య, వైద్య సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరాకు హామీ ఇవ్వాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం అన్నారు. ఉత్తర ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో ఢిల్లీ ప్రభుత్వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన సంఘటనలపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ విచారం వ్యక్తం చేశారు. 'ఈరోజు నాకు కొంచెం బాధగా ఉంది. మణిపూర్ కాలిపోతోంది. ఒక వర్గానికి చెందిన వారు మరొక వర్గానికి చెందిన వారిని చంపుతున్నారు. హరియానాలో కూడా ఒక వర్గానికి చెందినవారు మరొకరితో పోరాడుతున్నారు. మనలో మనం పోరాడుతూ ఉంటే మనం విశ్వగురువు ఎలా అవుతాం? విశ్వగురువుగా మారి నంబర్ వన్ దేశంగా ఎదగాలంటే మనం ఒక కుటుంబంలా జీవించాలి' అని అన్నారు. దేశంలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై విచారం వ్యక్తం చేసిన ఆయన, ప్రతి చిన్నారికి మంచి విద్య అందితే తప్ప, దేశం విశ్వగురువు కాదన్నారు. దేశంలోని 10 లక్షల ప్రభుత్వ పాఠశాలలు బాగుపడాలంటే రూ.6 లక్షల కోట్లు అవసరమవుతాయని నేను లెక్కలు వేసుకున్నాను. ఏడాదికి రూ.1.25 లక్షల ఖర్చు భారత్ లాంటి దేశానికి ఏమీ కాదన్నారు. ప్రతి పేదవాడు తమ పిల్లలను చదివించడం ద్వారా ధనవంతులు అవుతారని అన్నారు. కేవలం ప్రసంగాల ద్వారా భారతదేశం విశ్వగురువు కాదనీ, దేశంలోని ప్రజలందరికీ మంచి వైద్యం అందితేనే విశ్వగురువు అవుతుందని చెప్పారు. ఢిల్లీ పాలనా సేవల నియంత్రణపై ఇటీవల చట్టం గురించి మాట్లాడుతూ ఢిల్లీ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను హరించారని విమర్శించారు. 'ఢిల్లీ ప్రజలకు నేను హామీ ఇవ్వాలనుకుంటున్నాను. మేము మీ లాక్కున్న హక్కులను తిరిగి పొందుతాము. మేము సుప్రీం కోర్టులో పోరాడుతున్నాము. మంచి విద్య, వైద్య సదుపాయాలను అందించే పని కొనసాగుతుంది. వేగం మందగించవచ్చు, కానీ పని సాగుతుంది' అని అన్నారు.

విలువలు కాలరాసే పాలకులు మనకొద్దు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఉత్సాహంగా స్వాతంత్ర్యదిన వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజాస్వామ్య విలువల్ని, రాజ్యాంగ విలువల్ని కాలరాస్తున్న పాలకులు మనకొద్దని రానున్న రోజుల్లో వారిని ఇంటికి పంపించటానికి ప్రజలందరూ కంకణబద్ధులు కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఉద్బోధించారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్ వద్ద సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తరువాత కూడా మౌలిక సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రజాస్వామిక విలువల్ని నేటి ప్రభుత్వాలు ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలను గౌరవించటం లేదన్నారు. కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. మణిపూర్ ఘటనతో మైనార్టీల్లో భయపడుతున్నారని తెలిపారు. దేశంలో అశాంతి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు కల్పించిందని అయితే జీవోనం.1 ద్వారా ప్రతిపక్షాలను అడ్డుకుంటూ పోలీస్ రాజ్యాన్ని నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దేశ రాజ్యాంగ, లౌకిక వ్యవస్థలను రక్షించుకోవటానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీహెచ్.కోటేశ్వరరావు, దోనేపూడి శంకర్, రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, విశ్రాంత ప్రొఫెసర్ నరసింహారావు, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రానాయక్, విజయవాడ నగర అధ్యక్షులు ఎస్‌కె.నజీర్ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

రాజ్యాంగ లక్ష్యాల సాధనకు పునరంకితం: పి.హరినాథరెడ్డి

రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు మనం పునరంకితం కావాలని విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని విశాలాంధ్ర ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సందేశం ఇచ్చారు. ఏ స్వాతంత్ర్యం కోసం వీరులు ప్రాణాలు త్యాగం చేసి సాధించారో ఆ లక్ష్యాలు నేరవేరటం లేదన్నారు. పాలకులు భావప్రకటనా స్వేచ్ఛా లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే పత్రికల స్వేచ్ఛను హరిస్తున్నారని చెప్పారు. దీంతో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలు వారి సమస్యలను చెప్పుకోలేక పోతున్నారని చెప్పారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడుకోవటం కోసం ఉద్యమించాల్సి ఉందన్నారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు, సీఏ రాంబాబు, ఎడిషన్ మేనేజర్ సాయిబాబు, సీనియర్ పాత్రికేయులు టీవీ.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే సామాజిక న్యాయం: జల్లి విల్సన్

డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన భారత లౌకిక రాజ్యాంగం ద్వారా సామాజిక న్యాయం జరుగు తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. సీపీఐ 6, 7 డివిజన్‌ల ఆధ్వర్యంలో ఆయా డివిజన్‌ల సీపీఐ ఇన్‌చార్జ్ అప్పురబోతు రాము అధ్యక్షతన విజయవాడ మొగల్రాజపురంలోని నిర్వహించిన 77వ స్వాతంత్ర్య దినోత్సవేడుకల్లో విల్సన్ ముఖ్యఅతిథి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పాలకుల కార్పొరేట్ విధానాల వల్ల దేశ సంపద కొద్దిమంది చేతుల్లో ఉందన్నారు. దేశంలో 65 శాతం మంది కష్టజీవులు ఉన్నారని వారందరికీ స్వాతంత్ర్య ఫలాలు లభించాలంటే రాజ్యాంగాన్ని సమగ్రంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలపై దాడులను తిప్పికొట్టాలి: ఓబులేసు

మహిళలపై జరుగుతున్న దాడులను సమాజం తిప్పికొట్టే విధంగా చేయాలని, ఉద్యమాలకు మహిళలు కొంగు బిగించాలని, రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో 77 వ స్వతంత్ర్య వేడుకలను పురస్కరించు కొని జాతీయ పతాకాన్ని అయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడంతో పాటు వారి బాటలో నడుచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. నేడు సమాజంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు రోజురోజుకీ దిగజారిపోతున్నాయని అందుకు మణిపూర్ ఘటనే నిదర్శనం అన్నారు. ముఖ్యంగా ఈనాడు పాలకులు మనువాద సిద్ధాంతాన్ని తీసుకువచ్చి మహిళలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి పరిస్థితులు రాకుండా మహిళలు తమ గొంతెత్తి నినాదించాలని పిలుపునిచ్చారు. ఎక్కడైతే కార్మికుల హక్కుల కోసం పోరాట జరుగుతుందో అక్కడ ఏఐటీయూసీ ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి సుబ్బరాయుడు, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి కల్లేపల్లి శైలజ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు, జేవీఎస్ ట్రస్ట్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.